



కోటప్పకొండకు తరలివెళ్తున్న అమీన్‌సాహెబ్ పాలెం ప్రభలు

మహాశివరాత్రి.. మహోత్సవాలకు శైవక్షేత్రాలు సిద్ధమయ్యాయి. చేదుకో కోటయ్య.. చేదుకో.. అంటూ భక్తులు శివయ్య దర్శనాలకు సిద్ధమయ్యారు. విద్యుత్ వెలుగుల్లో ఆలయాలు కాంతులీనుతున్నాయి. స్వామి దర్శనానికి పెద్దసంఖ్యలో తరలివచ్చే భక్తుల కోసం అధికారులు ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. అభిషేకాలు, ప్రత్యేక పూజలకు కూడా ఏర్పాట్లు జరిగాయి. కోటప్పకొండ, వడ్లమూడి క్వారీ, గోవాడ క్షేత్రాలకు ప్రభలు ఆయా గ్రామాల నుంచి బయల్దేరాయి. ప్రసిద్ధ శైవక్షేత్రం కోటప్పకొండ తిరునాళ్ల శుక్రవారం నేత్రపర్వంగా జరగనుంది. వడ్లమూడి, గోవాడ క్షేత్రాల్లోని బాలకోటేశ్వరస్వామి ఆలయాల చుట్టూ పశువులు, జీవాలను తిప్పి కాపరులు మొక్కులు తీర్చుకున్నారు. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వార్ల కల్యాణోత్సవానికి కాకాని మల్లన్న సన్నిధిని ముస్తాబు చేశారు. అమరావతిలోని బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి గ్రామోత్సవం గురువారం కన్నుల పండువగా జరిగింది. శైవక్షేత్రాల్లో శుక్రవారం తెల్లవారుజాము నుంచే భక్తుల దర్శనాలకు ఏర్పాట్లు జరిగాయి.



విద్యుత్ కాంతులతో వెలుగొందుతున్న కోటప్పకొండ ఆలయం

ప్రత్యేక అలంకరణలో శ్రీ త్రికోటేశ్వర స్వామి మూల విరాట్



కోటప్పకొండ తిరునాళ్ళకు తరలివస్తున్న భారీ విద్యుత్ ప్రభలు



విద్యుత్ కాంతు లీనుతున్న అమరేశ్వర స్వామి ఆలయ గాలిగోపురం

చేదుకో.. కోటయ్యా

నేడు మహాశివరాత్రి

- విద్యుత్ వెలుగుల్లో శైవక్షేత్రాలు
- తిరునాళ్లకు కోటప్పకొండ ముస్తాబు
- బాలకోటేశ్వరస్వామి దర్శనాలకు భక్తుల క్యూ
- నేటి రాత్రి మల్లన్న, అమరేశ్వరుని కల్యాణోత్సవాలు

కోటప్పకొండ(నరసరావుపేట), మార్చి 7: కోటప్పకొండలోని త్రికోటేశ్వరస్వామి సన్నిధి తిరునాళ్లకు ముస్తాబైంది. అర్ధరాత్రి త్రికోటేశ్వర స్వామికి లింగోద్భవ అభిషేకాలు వైభవంగా జరగనున్నాయి. తిరునాళ్లకు రాష్ట్ర పండుగ హోదాతో ప్రభుత్వం తరపున కోటయ్య స్వామికి ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. దేవాలయంలో ఏర్పాట్లను ఈవో జి.శ్రీనివాసరెడ్డి, ట్రస్టీ రామకృష్ణ కొండలరావు పర్యవేక్షిస్తున్నారు. నరసరావుపేట, చిలకలూరిపేట, వినుకొండ, అద్దంకి, చీరాల, ఒంగోలు బస్టాండ్ల నుంచి 528 ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. సేవలు అందించేందుకు స్కౌట్స్, సత్యసాయి సేవా సమితి సభ్యులు కొండకు తరలి వచ్చారు. నాదెండ్ల మండలం అవిశాయపాలెం, అప్పాపురం నుంచి ఒక్కొక్క ప్రభ కొండకు గురువారం బయల్దేరింది. చిలకలూరిపేట మండలం కమ్మవారిపాలెం, మద్దిరాల, యడవల్లి, గోవిందాపురం, కోమటినేనివారిపాలెం, కావూరు గ్రామాల నుంచి ఒక్కొక్కటి, చిలకలూరిపేట మండలం పురుషోత్తపట్నం నుంచి ఆరు, బొప్పూడి నుంచి రెండు ప్రభలు కొండకు వస్తున్నాయి. నరసరావుపేట మండలం ఉప్పలపాడు, గురవాయపాలెం నుంచి ఒక్కొక్కటి, కాకాని నుంచి రెండు ప్రభలు కొండకు తరలి వస్తున్నాయి. భారీ ప్రభల కోసం చిలకలూరిపేట రోడ్డులోని ప్రధాన విద్యుత్ లైన్‌కు విద్యుత్ సరఫరా ఉదయం 8 నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిలిపివేయనున్నారు.

వీఐపీలకు పెద్దపీట..


కోటప్పకొండ తిరునాళ్లలో వీఐపీలకు పెద్దపీట వేస్తున్నారు. కొండ కింద కారు దిగిన దగ్గర నుంచి స్వామి దర్శనం చేసుకునే వరకు వీఐపీలకు అన్ని సేవలు ఉచితంగా అందించనున్నారు. వేలాదిగా దర్శనం పాసులను పంపిణీ చేశారు. సామాన్య భక్తులకు అటు ఆర్టీసీ, ఇటు దేవస్థానం అన్ని సేవలకు టిక్కెట్లను విక్రయిస్తోంది. ఆర్టీసీ కూడా వీఐపీలకు ఉచితంగా 20 బస్సులను ఏర్పాటు చేసి వారి సేవకు సిద్ధమవగా, సామాన్య భక్తులను నుంచి ముక్కుపిండి అధిక చార్జీలను వసూలు చేస్తోంది.

అమరేశ్వరుని గ్రామోత్సవం

అమరావతి: మహాశివరాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం సాయంత్రం బాలచాముండికా సమేత అమరేశ్వరస్వామి గ్రామోత్సవం పులివాహనం, పల్లకిపై కన్నుల పండువగా జరిగింది. ఉదయం మండప పూజ, నిత్యోపాసన, రుద్రహోమం, బలిహరణ కార్యక్రమాలు జరిగాయి. శుక్రవారం తెల్లవారుజాము నుంచి జరిగే స్వామివారి దర్శనం, అభిషేకాలకు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం రాత్రి 9 గంటలకు లింగోద్భవకాల అభిషేకాలు, ఎదురుకోల ఉత్సవం, ఆదివారం తెల్లవారుజామున 3 గంటలకు స్వామివార్ల కల్యాణోత్సవం జరుగుతుంది.


దేదీప్యమానంగా మల్లన్న సన్నిధి

పెదకాకాని: మహాశివరాత్రి కల్యాణ బ్రహ్మోత్సవాలకు పెదకాకాని మల్లన్న సన్నిధిని సర్వంసిద్ధం చేశారు. ఆలయాన్ని రంగురంగుల విద్యుత్ దీపాలు, పూలతో శోభయమానంగా అలంకరించారు. పెద్ద సంఖ్యలో వచ్చే భక్తులకు స్వామివారి దర్శనం కోసం శీఘ్ర, లఘు, ఉచిత దర్శనాలకు అవసరమైన క్యూలైన్లను ఏర్పాటు చేశారు. భ్రమరాంబా సమేత మల్లికార్జునస్వామి వార్ల కల్యాణానికి ముస్తాబు చేశారు. ఏర్పాట్లను డీసీ దాసరి శ్రీరామవరప్రసాద్ పర్యవేక్షించారు.



విద్యుత్ కాంతులతో విరాజిల్లుతున్న పెదకాకాని మల్లన్న సన్నిధి

క్వారీలో ప్రత్యేక పూజలు



క్వారీ తిరునాళ్లకు సిద్ధమైన నారా కోడూరు విద్యుత్‌ప్రభ, ఇన్‌సెట్లో పూజలందుకొంటున్న శ్రీ బాల కోటేశ్వర స్వామి



చేబ్రోలు: వడ్లమూడి క్వారీ శ్రీ బాలకోటేశ్వరస్వామి సన్నిధిలో గురువారమే తిరునాళ్ల ప్రారంభమయ్యాయి. సమీప గ్రామాల ప్రజలు ఆలయానికి తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. తెనాలి డీఎస్పీ రమేష్ ఆధ్వర్యంలో 500 మంది సిబ్బందితో పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు. ప్రధానరహదారిపై ఆలయం ఉండటంతో తెనాలి, గుంటూరు మార్గంలో ట్రాఫిక్‌ను పలు మార్గాలో మళ్లించారు.

ఉత్సవాలు ప్రారంభం



గోవాడ ఆలయ విద్యుత్ ప్రభ



విద్యుత్ అలంకరణలో ఆలయ రాజగోపురం

అమృతలూరు, మార్చి 7: అమృతలూరు మండలం గోవాడ శ్రీబాలకోటేశ్వరస్వామి ఆలయాన్ని భక్తుల దర్శనానికి సన్నద్ధం చేశారు. ఆలయం వద్ద చలువ పందిళ్లు నిర్మించారు. స్వామి వారికి వెన్న తదితర మొక్కులను భక్తులు చెల్లించారు. డీసీ బొంతు మహేశ్వరరెడ్డి, డీఎస్పీ మురళీకృష్ణ ఆలయం వద్ద ఏర్పాట్లను పరిశీలించారు. ఇక్కడ శివరాత్రి ఉత్సవాలు ఐదు రోజుల పాటు జరగడం విశేషం. తెనాలి, బాపట్ల, రేపల్లె నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసింది. కాకతీయ, ఆర్యవైశ్య, బ్రాహ్మణ, పద్మశాలీయ సత్రాల్లో అన్నదానం చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశారు.

పెదకాకాని ఆలయం లోపల ప్రత్యేక విద్యుత్ కాంతులు





కోటప్పకొండలో గురువారం రాత్రికి చేరుకున్న ప్రభలు, ఏర్పాటుచేసిన విద్యుత్ కాంతులు

దేవుడు.. యధార్థవంతుడు

- పాస్టర్ మోహన్ సీ లాజరస్
- ఘనంగా ప్రారంభమైన గుడారాల పండుగ





ఏసుక్రీస్తు గీతాలను ఆలపిస్తున్న అబ్రహం, జాన్‌వెస్లీ, రాజు, ఫ్రైడిపాల్, రమేష్, గుడారాల పండుగకు హాజరైన విశ్వాసులు

గుంటూరు(తూర్పు), మార్చి 7: దేవుడు న్యాయవంతుడు, యథార్థవంతుడు అని పాస్టర్ మోహన్ సీ లాజరస్ వ్యాక్యోపదేశం చేశారు. గుంటూరు సమీపంలోని గోరంట్ల హోసన్న మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో 47వ అంతర్జాతీయ గుడారాల పండుగ గురువారం ప్రారంభమైంది. తమిళనాడు నుంచి వచ్చిన పాస్టర్లు మోహన్ సీ లాజరస్, మెల్బన్ లాజరస్, హోసన్నా మినిస్ట్రీస్ అధ్యక్షుడు అబ్రహం, హోసన్న మినిస్ట్రీస్ చీఫ్ పాస్టర్ జాన్‌వెస్లీ, పాస్టర్లు రమేష్, ఫ్రైడిపాల్, రాజు పండుగను ప్రారంభించారు. మోహన్ సీ లాజరస్, మెల్బన్ లాజరస్ గుడారాల పండుగకు వచ్చే ప్రతిఒక్కరూ భాగ్యవంతులు అని సందేశామిచ్చారు. 1977లో ప్రారంభమై నేడు లక్షలాది మంది విశ్వాసుల ప్రేమకు గుడారాల పండుగ చేరువైందన్నారు. అంతకముందు అమెరికా నుంచి వచ్చిన ఫాదర్ ఎర్నిస్ట్ పాల్ 'నిత్యతేజుడు ఏసయ్య' అనే పాటల పుస్తకాలను ఆవిష్కరించారు. 'నిత్యతేజుడు ఏసయ్య' అనే అల్బమ్‌ను మదనపల్లి నుంచి వచ్చిన పాస్టర్ రాజశేఖర్ ఆవిష్కరించారు. మాజీ ఎమ్మెల్సీ రాజేశ్వరరావు, వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన విశ్వాసులు ప్రార్థనల్లో పాల్గొన్నారు.

అమరావతిపై వైసీపీ పాలకులకు అక్కసు

- 1542వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

4 లో..

రెండు నెలలకే రిపేరు

- ట్యాబ్‌ల్లో సాంకేతిక సమస్యలు
- ఇంజనీరింగ్ విద్యార్థులతో మరమ్మతులు
- కొలిక్కిరాని సమస్యలు.. నిరుపయోగంగా ట్యాబ్‌లు



గుంటూరు రూరల్ పరిధిలోని జడ్పీ స్కూల్‌లో సాంకేతిక సమస్యలతో పనిచేయని ట్యాబులు

గుంటూరు (విద్య), మార్చి 7: పేద విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానంలో విద్య అందిస్తున్నామంటూ ప్రచారం చేసుకునే ప్రభుత్వం క్షేత్రస్థాయిలో ట్యాబ్‌ల పనితీరు గురించి పట్టించుకోవడం లేదు. ట్యాబ్‌లు ఇచ్చి చేతులు దులుపుకుంది. ఫలితంగా విద్యార్థులకు ఇచ్చిన ట్యాబ్‌ల్లో రెండునెలలకే సాంకేతిక సమస్యలు తలెత్తి పనిచేయడం లేదు. దీంతో రోజూ వాటిని పాఠశాలకు తీసుకురావడం తప్ప వాటిని వినియోగించిన దాఖలాలు లేవు. ఉమ్మడి జిల్లాలో 8వ తరగతి విద్యార్థులకు 55,727 ఈ ఏడాది జనవరిలో ట్యాబ్‌లను పంపిణీ చేశారు. ఇందులో పల్నాడు జిల్లాకు 31,215, గుంటూరు జిల్లాకు 12,232, బాపట్ల జిల్లాకు 12,125 ట్యాబ్‌లను కేటాయించారు. బైజూస్ కంటెంట్‌తో వీటిని విద్యార్థులకు అందజేశారు. అయితే ఇంతవరకు బాగానే ఉన్నా విద్యార్థుల చేతికి వచ్చిన తర్వాత ట్యాబ్‌ల్లో సాంకేతిక సమస్యలు నెలకొన్నాయి. ఉమ్మడి జిల్లాలో దాదాపు ప్రతి పాఠశాలలో డజన్ల సంఖ్యలో ట్యాబ్‌లు సాంకేతిక సమస్యలతో మూలన పడుతున్నాయి. ఈ సాంకేతిక సమస్యలను పరిష్కరించడం కోసం గౌరవ వేతనం అందజేసి ఇంజనీరింగ్ విద్యార్థులను నియమించుకున్నారు. ట్యాబ్‌ల్లో వచ్చే సమస్యలను పరిష్కరించడానికి విద్యాశాఖలో ప్రత్యేకంగా ఒక కోఆర్డినేటర్‌ను నియమించారు. పాఠశాలల వారీగా వివరాలు సేకరించి ఆ కోఆర్డినేటర్ ఇంజనీరింగ్ విద్యార్థులకు వివరాలు అందజేస్తున్నారు. కొన్ని పాఠశాలలను ఒక క్లస్టర్‌గా చేసి వాటి పరిధిలోని విద్యార్థుల ట్యాబ్‌ల్లో సాంకేతిక సమస్యలు పరిష్కరించేలా ఏర్పాట్లు చేశారు. అయితే ఆ సమస్యలు పరిష్కరించడంలో ఇంజనీరింగ్ విద్యార్థులు సఫలం కాలేకపోతున్నారు. గుంటూరు సమీపంలోని జడ్పీ పాఠశాలలో దాదాపు నెలరోజుల నుంచి ట్యాబ్‌లు పనిచేయడం లేదు.

సాధారణ పద్ధతిలోనే బోధన

"కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయుల వద్ద ఉన్న ట్యాబ్‌ల్లో సాంకేతిక సమస్యలు వచ్చినా పట్టించుకునేవారే లేరు. దీంతో సాధారణ పద్ధతుల్లోనే ఉపాధ్యాయులు విద్యార్థులకు బోధన అందిస్తున్నారు. గుంటూరులోని మున్సిపల్ పాఠశాలల్లో పదికిపైగా ట్యాబ్‌ల్లో సాంకేతిక సమస్యలను గుర్తించారు. గుంటూరు జిల్లాలో గత ఏడాది ఇచ్చిన 12వేలకు పైగా ట్యాబ్‌ల్లో దాదాపు సగం వరకు పనిచేయడం లేదు. కొన్ని ట్యాబ్‌ల్లో ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, రీల్స్ వంటి యాప్స్‌తోపాటు అశ్లీల వీడియోలు ఉన్నట్లు గత ఏడాది గుర్తించారు. పర్యవేక్షణ లేకపోవడంతో ట్యాబ్‌లను ఇతర కార్యకలాపాలకు విద్యార్థులు ఉపయోగిస్తున్నారని తల్లిదండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు."

నేడు గుంటూరు - తెనాలి మార్గంలో

ట్రాఫిక్ మళ్లింపు

● వాహన చోదకులు సహకరించాలని ఎస్పీ వినతి

గుంటూరు, మార్చి 7 చేబ్రోలు మండలం వడ్లమూడి క్వారీ వద్ద శ్రీ బాల కోటేశ్వర స్వామి వారి ఆలయంలో జరిగే మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా శుక్రవారం మధ్యాహ్నం నుంచి శనివారం ఉదయం వరకు తెనాలి - గుంటూరు మార్గంలో ట్రాఫిక్ దారి మళ్ళిస్తున్నట్లు తెనాలి డిఎస్పీ రమేష్‌బాబు తెలిపారు. ట్రాఫిక్ డైవర్షన్ 8న మధ్యాహ్నం 12 గంటల నుంచి మరుసటి రోజు శనివారం ఉదయం 6 గంటల వరకు వుంటుందన్నారు. ఆయా వివరాలు ఇలా ఉన్నాయి.

- చేబ్రోలు - ముట్లూరు రోడ్‌లో: బాపట్ల, పొన్నూరు నుండి గుంటూరు వెళ్ళే వాహనాలను ముట్లూరు రోడ్డులోకి పంపించి, పాతరెడ్డిపాలెంలో ఉన్న లేమల్లెపాడు క్రాస్ రోడ్డు గుండా అనంతవరప్పాడు మీదుగా గుంటూరు వెళ్ళాలన్నారు.
- చేబ్రోలు లోని వడ్లమూడి అడ్డరోడ్డు నుంచి: బాపట్ల మరియు పొన్నూరు నుండి తెనాలి వెళ్ళే వాహనాలను చేబ్రోలు మసీద్ సెంటర్ లో ఉన్న వడ్లముడి అడ్డరోడ్డు గుండా, వడ్లమూడి గ్రామం గుండా తెనాలి వెళ్ళాలన్నారు. చేబ్రోలు ప్రజలు అనగా గుడికి వెళ్ళే వారు కూడా అదే రూట్ గుండా వెళ్ళాలన్నారు.
- వడ్లమూడి అడ్డరోడ్డు: తెనాలి నుండి పొన్నూరు వెళ్ళే వాహనాలను వడమూడి అడ్డరోడ్డు గుండా పొన్నూరు, చేబ్రోలు వెళ్ళాలన్నారు.
- తెనాలి ఫ్లై ఓవర్ : గుంటూరు కు వచ్చే బారి వాహనాలను నందివెలుగు రోడ్డు వైపు మళ్ళించామన్నారు. క్వారీ కి వచ్చేఆర్టీసీ బస్సులను మాత్రమే పంపాలన్నారు.
- బుడంపాడు ఫ్లైఓవర్ : గుంటూరు నుండి బాపట్ల పొన్నూరు వెళ్ళు వాహనాలను అనంతవరప్పాడు అడ్డరోడ్డు గుండా అనంతవరప్పాడు మరియు లేమల్లెపాడు గ్రామాలు మీదగా చేబ్రోలుకు వచ్చివెళ్ళాలన్నారు. గుంటూరు నుండి తెనాలి వెళ్ళు వాహనాలు నందివెలుగు రోడ్డు గుండా మాత్రమే వెళ్ళాలన్నారు. అదేవిధంగా మహా శివరాత్రి పర్వదినం సందర్భంగా స్వామి వారి గుడికి వచ్చు భక్తులకు త్రీ వీలర్, టు వీలర్ వాహనాలను మాత్రమే నారాకోడూరు వైపు అనుమతిస్తామన్నారు. కాగా ఆయా వహన చోదకులు పోలీసులకు సహకరించాలని ఎస్పీ తుషార్ డూడీ కోరారు.

సొంత గూటికి మాజీ జడ్పీ చైర్‌పర్సన్ విజయ

● ఏపీసీసీ చీఫ్ షర్మిల సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక

గుంటూరు,మార్చి 7: గుంటూరు మాజీ జడ్పీ చైర్‌పర్సన్‌గా వ్యవహరించిన కూచిపూడి విజయ తన కుమారుడు కృష్ణకాంత్‌తో కలిసి ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల సమక్షంలో గురువారం విజయవాడలోని ఆంధ్రరత్న భవన్‌లో జరిగిన కార్యక్రమంలో కాంగ్రెస్‌లో చేరారు. ఈ సంద ర్భంగా షర్మిల పార్టీ కండువాతో వారిని కాంగ్రెస్‌లోకి సాదరంగా ఆహ్వానిం చారు. వైఎస్ రాజశేఖరరెడ్డి కుటుంబంతో కూచిపూడి సాంబశివరావుకు తొలి నుంచి మంచి స్నేహ సంబంధాలున్నాయి. 2004లో వైఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కూచిపూడి సాంబశివరావు దంపతులకు ప్రత్యేక ప్రాధాన్యం కల్పించారు.



నగదు చెక్కును అందజేస్తున్న ఫౌండేషన్ ట్రస్టీ పీ.ప్రతీష

శంకర నేత్రాలయానికి రూ.10లక్షల విరాళం

గుంటూరు(తూర్పు), మార్చి7 శంకర నేత్రాలయం ఆధ్వర్యంలో నిర్మిస్తున్న నూతన భవన నిర్మాణానికి బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ రూ.10లక్షల విరాళాన్ని ప్రకటించారు. ఈ మేరకు గురువారం లక్ష్మీపురంలో ఫౌండేషన్ ట్రస్టీ పి.పద్మాలక్ష్మీ ప్రతీష శ్రీ కంచి కామకోటి పీఠ మెడికల్ ట్రస్ట్‌కు చెక్కును ఆస్పత్రి చీఫ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ పొట్టి సుధాకర్‌కు అందజేశారు. ఈ సందర్భంగా పి.సుధాకర్ మాట్లాడుతూ ప్రభుత్వం, దాతల సహకారంతో గత రెండు దశాబ్దాలకు పైగా వేలాదిమందికి ఉచిత వైద్య పరీక్షలతో పాటు అవసరమైతే శస్త్ర చికిత్సలు అందజేస్తున్నామని వివరించారు. భారీ విరాళాన్ని ఇచ్చి ఔదార్యత చాటుతున్న బొమ్మిడాల శ్రీకృష్ణమూర్తి ఫౌండేషన్ సేవలు అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆస్పత్రి యూనిట్ హెడ్స్ సీహెచ్ త్రిపుర, ఎం.మాధవి, మురళీధర్ తదితరులు పాల్గొన్నారు.

కూల్.. ఫుల్

- మిర్చి టిక్కీలు శీతల గిడ్డంగుల బాట
- ఇప్పటికే 65 శాతం నిండిన కోల్డ్‌స్టోరేజ్‌లు
- చిన్నవి అయితే 100 శాతం నిండినట్లుగా బోర్డుల ఏర్పాటు
- మార్కెట్‌లో మిర్చి ధర తగ్గడమే మూలకారణం



కోల్డ్‌స్టోరేజ్‌లో నిల్వ చేసేందుకు లారీల్లో తరలిస్తున్న మిర్చి టిక్కీలు



గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): మిర్చి ధర తగ్గడంతో రైతులు చేసేది లేక తమ పంటని శీతల గిడ్డంగులకు తరలించడం ప్రారం భించారు. ప్రస్తుతం గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీలో కొనసాగుతున్న మిర్చి ధరలకు అమ్మితే తాము పూర్తిగా నష్టపోతా మనే నిర్ణయానికి రైతులు వచ్చారు. మిర్చి టిక్కీకి రూ.210 కోల్డ్ స్టోరేజ్ ఛార్జీ అయినప్పటికీ ఏమాత్రం ఆలోచన చేయకుండా వాటిల్లో నిల్వచేస్తున్నారు. మార్కెట్‌లో ధర పెరిగినప్పుడు తీసుకొచ్చి విక్ర యించుకొందామని భావిస్తున్నారు. పెట్టుబడి అవసరమైన రైతులు మాత్రంచేసేది లేక మార్కెట్‌లో లభిస్తున్న ధరకే మిర్చి విక్రయిం చేస్తున్నారు. ఇటీవలకాలంలో ఎప్పుడూ లేనివిధంగా సీజన్ మధ్య లోనే సరుకు కోల్డ్‌స్టోరేజ్‌లకు చేరుకోవడం ఇప్పుడే చూస్తున్నామని రైతులు, మిర్చి వర్తకులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో ఏ.బీ కేటిగిరీ కోల్డ్‌స్టోరేజ్‌లు 100శాతం నిండిపోయాయి. మిగతావాటిల్లో మాత్రం 65శాతం వరకు నిండుగా ఇంకా 35శాతం ఖాళీ ఉన్నట్లు కోల్డ్‌స్టోరేజ్‌ల యాజమాన్యాలు చెబుతున్నాయి.

విస్తారంగా పండిన మిర్చి..

ఉమ్మడి గుంటూరు జిల్లాలో ఒక్క ప్రత్తిపాడు పరిసర ప్రాంతాలు మినహా అంతటా మిర్చి పంట ఈ ఏడాది విస్తారంగా పండింది. దిగుబడి బాగానే వచ్చినట్లు రైతులు చెబుతున్నారు. ఇదేవిధంగా ప్రకాశం, కర్నూలు, కర్ణాటక, తెలంగాణలోని ఖమ్మం, వరంగల్, నల్గొండ జిల్లాల్లోనూ మిర్చి పంట ఎక్కువ విస్తీర్ణంలో సాగు జరిగింది. ఈ కారణంగా గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ ఉన్న సరుకు బయటకు వెళ్లకుండానే నవంబరు నుంచే రాయలసీమ జిల్లాలు, కర్ణాటకలోని బళ్లారి నుంచి మిర్చి సరుకు గుంటూరు మిర్చియార్డుకు రైతులు తీసుకొచ్చారు. కేవలం కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వవున్న సరుకు విక్రయం జరగాల్సిన నవంబరు, డిసెంబరు నెలల్లో కొత్త సరుకు రావడంవలన స్టోరేజ్‌లలో సరుకు అలానే ఉండిపోయింది. గుంటూరు పరిసర ప్రాంతాల్లో 81 కోల్డ్‌స్టోరేజ్‌లు ఉండగా వాటిల్లో 71 మాత్రమే రన్నింగ్‌లో ఉన్నాయి. వీటిల్లో చాలా గిడ్డంగుల నిల్వ సామర్థ్యం లక్ష టిక్కీలుగా ఉన్నది. కొన్ని మాత్రం 40 వేల నుంచి 60 వేల మధ్యన ఉన్నాయి.

ధర తగ్గుదల ప్రారంభం

కాగా జనవరిలో సంక్రాంతి పండగ అయిపోగానే ఉమ్మడి గుంటూరుజిల్లా నుంచి రైతులు సరుకు తీసుకురావడం ప్రారంభిం చారు. మార్కెట్‌కు వస్తున్న సరుకు ట్రేడింగ్ జరిగేంత డిమాండ్ లేకపోవడంతో ధర తగ్గడం ప్రారంభమైంది. మిర్చి తాలు కాయలకు తొలుత క్వింటాల్‌కు రూ.9 వేల ధర లభించింది. ఇప్పుడు రూ.7 వేలు మాత్రమే లభిస్తోంది. దీంతో రూ.9 వేల ధర మీద కొనుగోలు చేసిన వారు ఆ సరుకుని కోల్డ్ స్టోరేజ్‌లో పెడుతున్నారు. మరోవైపు మీడియం క్వాలిటీ రకాలైన 334, నెంబరు. 5, 273, 341, 4884, సూపర్ 10, ఆర్మూరు వంటి రకాలకు పెద్దగా డిమాండ్ లేదు. రకం, నాణ్యతని బట్టి క్వింటాల్‌కు రూ.10 వేల నుంచి రూ.12 వేల ధర మాత్రమే ఎగుమతిదారులు ఆఫర్ చేస్తున్నారు. సీజన్ ప్రారంభంలో రూ.25 వేల వరకు ఉన్న తేజ, బ్యాడిగి వంటి మేలిమి రకాలు కూడా ఇప్పుడు రూ.18 వేలకు దిగి వచ్చాయి. ఈ ధర మీద విక్రయిస్తే రైతుకు పెట్టుబడి ఖర్చులు కూడా చేతికి రావు.

రుణాలు చెల్లించలేక..

మార్కెట్‌లో మాంద్యం నెలకొన్న దృష్ట్యా రైతులు కోల్డ్ స్టోరేజ్‌ల వైపు చూస్తున్నారు. టిక్కీకి రూ.210, అక్కడికి రవాణ, దిగుమతి ఛార్జీలు అదనం అయినప్పటికీ శీతలగిడ్డంగికి తరలించి నిల్వ చేస్తున్నారు. కాగా గత ఏడాది కోల్డ్‌స్టోరేజ్‌లలో నిల్వ చేసిన టిక్కీలకు చాలామంది రైతులు సహకార బ్యాంకులనుంచి రుణాలు తీసుకున్నారు. ఆరుణం చెల్లించలేకపోతున్నారు. దీంతో వారికి కొత్త రుణాలు వచ్చే పరిస్థితి లేకుండా పోయింది. ప్రత్తిపాడు పరిసరాలు, పల్నాడు, ఖమ్మం, వరంగల్ మార్కెట్‌ల పరిధిలోని కోల్డ్‌స్టోరేజ్‌లలోనూ ఇదే పరిస్థితి నెలకొంది. ధర పెరగకపోతే మరో 20 రోజుల నుంచి నెల వ్యవధిలోనే శీతల గిడ్డంగులు నిండిపోతాయని వాటి యజమానులు చెబుతున్నారు. ఆ పరిస్థితుల్లో రైతులు తప్పక సరుకుని విక్రయించుకోవాల్సిన పరిస్థితి ఉత్పన్నమైతుంది. దాంతో ధర మరింత పతనమయ్యే అవకాశం లేకపోలేదు. ఈ నేపథ్యంలో మిర్చి ధర పడిపోకుండా ప్రభుత్వం కేంద్రం దృష్టికి తీసుకెళ్లి రైతుల వద్ద మిర్చిని కొనుగోలు చేయాలని కోరుతున్నారు.

కౌలు రైతు ఆత్మహత్య



నరసింహరావు(ఫైల్)

రాజుపాలెం,మార్చి7: పెట్టుబడి నిమిత్తం తీసుకున్న అప్పులు ఎక్కువై కౌలురైతు ఆత్మహత్యకు పాల్పడిన ఘటన మండలంలోని మొక్కపాడు గ్రామంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన నాన్నబాల నరసింహారావు(38) పదేళ్ల నుంచి 12 ఎకరాల పొలం కౌలుకు తీసుకొని సాగుచేస్తున్నాడు. ఈ క్రమంలో దిగుబడి తక్కువగా వచ్చి రైతుల వద్ద పెట్టుబడి నిమిత్తం తీసుకున్న సుమారు రూ.60లక్షలకు వడ్డీ ఎక్కువైంది. అసలు, వడ్డీ ఎలాతీర్చాలో తెలియక మనస్తాపనకు గురై గురువారం తెల్లజామున తను సాగుచేస్తున్న పొలం వెళ్లి పురుగుల మందు తాగి బంధువులకు ఫోన్ చేసి తన పిల్లలను జాగ్రత్తగా చూసుకోవాలని కోరాడు. కుటుంబసభ్యులు వెంటనే పొలం వెళ్లి చూశారు. నోటి నుంచి నురగరావటం గమనించి వెంటనే చికిత్స నిమిత్తం సత్తెనపల్లి తీసుకువెళ్లారు. పరిశీలించిన వైద్యులు మృతి చెందినట్లు చెప్పారు. భార్య ఫిర్యాదు మేరకు హెడ్ కానిస్టేబుల్ జె.కనకరాజు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



గంజాయి వివరాలు తెలియజేస్తున్న సెబ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్

457కిలోల గంజాయి పట్టివేత

బాపట్ల, మార్చి 7: బాపట్ల మండలం సూర్యలంక రోడ్డులోని హైవేబైపాస్ మీదుగా కంటైనర్‌లో గంజాయి తరలిస్తున్నట్లు గురువారం తెల్లవారుజామునసెబ్ అధికారులకు సమాచారం వచ్చింది. దీంతో జిల్లా సెబ్‌అధికారి జి.నరసింహారావు సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేశారు. ఓ కంటైనర్‌లో 17బస్తాలలో గంజాయి ఉన్నట్లు గుర్తించారు. ఈ వాహనానికి పైలెట్‌గా వెళుతున్న కారును అదుపులోకి తీసుకొని కంటైనర్‌లో ఉన్న 17బస్తాలలోని 457కిలోల గంజాయిని సీజ్ చేశారు. దీని విలువ రూ.25లక్షలు ఉంటుందని జిల్లా సెబ్ అధికారి నరసింహారావు తెలిపారు. కంటైనర్ రాజమండ్రి నుంచి మచిలీపట్నం, రేపల్లె మీదుగా చెన్నై వెళుతున్నట్లు గుర్తించామన్నారు. వాహనంలోని ముగ్గురు వ్యక్తులను అదుపులోకి తీసుకోగా అందులో ఇద్దరు రాజమండ్రికి చెందినవారు కాగా ఒకరు చెన్నైకి చెందినవ్యక్తి అని తెలిపారు. పూర్తివివరాలు తెలియాల్సి ఉందన్నారు. అదుపులోకి తీసుకున్న వ్యక్తులను కోర్టులో హాజరుపరుస్తామన్నారు.



అన్నప్రసాద వితరణ చేస్తున్న తులసీ యోగీష్ తదితరులు

తులసీ సీడ్స్ ఆధ్వర్యంలో

పోలీస్ సిబ్బందికి భోజన సదుపాయాలు

గుంటూరు, మార్చి7: మహాశివరాత్రి పురస్కరించుకొని కోటప్ప కొండకు వచ్చే భక్తులకు భద్రత పర్యవేక్షించే స్కౌట్స్ అండ్ గైడ్స్ సిబ్బందికి, పోలీసులకు తులసీ సీడ్స్ ఛైర్మన్ తులసీ రామచంద్రప్రభు అల్పాహార, భోజన సదుపాయాలను ఏర్పాటు చేశారు. ఈ సదర్భంగా తులసీ గ్రూపు మేనేజింగ్ డైరక్టర్ తులసీ యోగీష్ గురువారం భోజన కార్యక్రమాన్ని ప్రారంభించారు. యోగీష్ మాట్లాడుతూ 13 ఏళ్ళుగా భక్తులసేవ, సహాయ కార్యక్రమాల నిమిత్తం కోటప్పకొండ తిరునాళ్ళ భద్రతకు విచ్చేసే పోలీస్ సిబ్బంది, స్కౌట్స్ అండ్ గైడ్స్ అందిస్తున్న సేవలు వెలకట్టలేనివని కొనియాడారు. మహాశివరాత్రికి రెండు రోజుల ముందు నుంచి వరుసగా మూడు రోజుల పాటు ఈ సదుపాయాలు వారికి అందుబాటులో ఉంటాయని పేర్కొన్నారు. శిబిరంలో 500 మంది స్కౌట్స్, గైడ్స్ సిబ్బందికి, మరో 3 వేల మంది పోలీస్ సిబ్బందికి అన్నప్రసాద వితరణ కార్యక్రమం చేశారు. కార్యక్రమంలో స్కౌట్స్ స్టేట్ ఆర్గనైజింగ్ కమిషనర్ పీ.శ్రీనివాసరావు, క్యాంపు కన్వీనర్ రాంబాబు, ఆఫీసర్ టీ.శ్రీనివాసరావు, క్యాంపు సహాయకులు వీవీ హరనాధ్, ఎం.కృష్ణయ్య, షేక్ దావూద్ పాల్గొన్నారు.

డీఎస్పీకి జనసేన నేతల ఫిర్యాదు

మంగళగిరి, మార్చి 7: జనసేన పార్టీ కార్యాలయ సిబ్బంది నివాసాల్లో పోలీ సులు ఆకస్మిక సోదాలు నిర్వహించిన ఘటనపై జనసేన పార్టీ నేతలు, లీగల్ సెల్ ప్రతినిధులు గురువారం రాత్రి గుంటూరు నార్త్ సబ్‌డివిజన్ డీఎస్పీ రవి కాంత్‌ను కలిసి ఫిర్యాదు చేశారు. లీగల్‌సెల్ కార్యదర్శి కోటేశ్వరరావు మాట్లాడుతూ బుధవారం రాత్రి మంగళగిరి పట్టణ సీఐ, ఇద్దరు ఎస్ఐలతో పాటు మరికొందరు సివిల్‌డ్రెస్‌లో జనసేన సిబ్బంది నివాసం ఉంటున్న అపార్టుమెంటుకు వచ్చారని, గేటుతీయడం ఆలస్యం కావడంతో వాచ్‌మెన్ కుటుంబ సభ్యులపై దౌర్జన్యం చేశారని ఆరోపిస్తూ వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ జిల్లా ఎస్పీ తుషార్ డూడీతోపాటు డీఎస్పీకి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జనసేన ఎంటీఎంసీ అధ్యక్షుడు మునగపాటి వెంకట మారుతీ రావు, చేనేత వికాస విభాగం రాష్ట్ర కార్యదర్శి జంజనం వెంకట సాంబశివరావు, లీగల్ సెల్ సభ్యులు పాల్గొన్నారు.

అప్పుల ఆంధ్రాగా మార్చిన ఘనత జగన్‌దే

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



చిలకలూరిపేట అర్బన్,మార్చి 7: అక్షర క్రమంలో అభివృద్ధిలో ఎప్పుడూ మొదటి స్థానంలో ఉండే ఆంధ్రప్రదేశ్‌ను అప్పుల ప్రదేశ్‌గా మార్చిన ఘనత వైఎస్ జగన్‌కు దక్కుతుందని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు విమర్శించారు. మళ్ళీ గెలవటం సాధ్యం కాదన్న విషయం ఇప్పటికే జగన్‌కు అర్థమైందని, అందుకే దొంగ బిల్లులను డ్రా చేసుకొనేందుకు సచివాలయాన్ని సైతం తాకట్టు పెట్టి అప్పులు తెచ్చారని మండిపడ్డారు. రాష్ట్ర ప్రజల ఆత్మగౌరవానికి సంబంధించిన సచివాలయాన్ని తాకట్టు పెట్టి అప్పు తేవటమేకాకుండా తాకట్టుపెడితేతప్పేంటని? సమర్థించుకోవటం సిగ్గుమాలిన చర్యగా ఆయన అభివర్ణించారు. పట్టణంలోని క్యాంపు కార్యాలయంలో గురువారం ప్రత్తిపాటి విలేకరులతో మాట్లాడారు. గ్రాఫిక్స్ భవనాలకు బ్యాంకులు రుణాలు ఇచ్చాయా? అని ఆయన ప్రశ్నించారు. అప్పులు తెచ్చి అభివృద్ధి కాకుండా సొంత జేబులు నింపుకుంటున్నారని విమర్శించారు. ఎక్కడ పడితే అక్కడ ఎంత దొరికితే అంత అప్పు చేసి ఆంధ్రప్రదేశ్ ప్రజల నెత్తిన ఒక్కొక్కరిపై రూ.2.04 లక్షల భారం మోపారన్నారు. అమరావతిలో మేం భవనాలు కడితే వాటిపై అప్పులు తెచ్చుకున్న జగన్ విశాఖలో నిజమైన గ్రాఫిక్స్ చూయించారని ప్రత్తిపాటి మండి పడ్డారు. వైజాగ్ అభివృద్ధి అంటూ చూపిన గ్రాఫిక్స్ రెండు కోడికత్తులను తిరగవేస్తే ఎలా ఉంటుందో అలానే ఉందన్నారు. మింగ మెతుకు లేదు గాని పిన్నమ్మకు గాజులు చేయిస్తానన్నట్టూ విశాఖలో ఐకానిక్ బిల్డింగ్స్ కడతానని బడాయి మాటలు చెపుతున్నారని విమర్శించారు.



మందడం ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్నరైతులు

అమరావతిపై వైసీపీ పాలకులకు అక్కసు

● 1542వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్లూరు, మార్చి7: అమరావతిని నాశనం చేయాలనుకోవటం పెద్ద తప్పిదమని రాజధాని కోసం 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు అన్నారు. బిల్డ్ అమరావతి సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు గురువారం నాటికి 1542వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ, రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే మూడు ముక్కలాటకు సీఎం జగన్‌రెడ్డి స్వస్తి పలకాలన్నారు. ప్రజారాజధాని అమరావతిని నాశనం చేయాలనుకోవటం మంచిది కాదన్నారు. మూడు పంటలు పండిస్తూ సాగు చేసుకునే భూమిని ప్రభుత్వం అడిగితే రాజధాని కోసం త్యాగం చేశామన్నారు. ఒక్క రూపాయి కూడా ఆశించలేదన్నారు. ఐదేళ్ల నుంచి మూడు రాజధానులంటూ రైతులను మానసిక క్షోభకు జగన్‌రెడ్డి గురిచేశారని ఆవేదన వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయికి వచ్చి ఎవరెవరు భూములిచ్చారో తె లుసుకోవాలని హితవు పలికారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాల్లో ఆందోళనలు కొనసాగాయి.



దైవ సందేశమందిస్తున్న విచారణ గురువులు జోసఫ్

సాగరమాత ఉత్సవాలు ప్రారంభం

విజయపురిసౌత్, మార్చి 7: మండలంలోని విజయపురిసౌత్‌లో వేంచేసిన సాగరమాత మహోత్సవాలు గురువారం ప్రారంభమయ్యాయి. శాంతి, సమాధానం, ప్రేమ, కరుణ, వాత్సల్యాలను భక్తులకు ప్రసాదించాలని గోరంట్ల విచారణ గురువులు గోపు జోసఫ్ ప్రార్థించారు. సాగరమాతను భక్తితో ప్రార్థిస్తే పాపాలు తొలగిపోతాయన్నారు. ఆలయాన్ని, జపమాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. ముందుగా సాగరమాత విచారణ గురువులు పామిశెట్టి జోసఫ్‌బాలసాగర్, జోసఫ్ తంబి దివ్యబలిపూజలను నిర్వహించారు. గురుశ్రీ అల్లం చినశౌరెడ్డి దివ్యబలిపూజ, వాక్య పరిచర్య చేశారు. రాత్రి తేరు ప్రదిక్షణ గావించారు. సంసోను-డెలీల బుర్రకథ, రక్తబలి బైబిల్‌నాటకం ప్రదర్శించారు.

పీజీ పరీక్షలు వాయిదా

పెదకాకాని, మార్చి7: ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయ పోస్ట్ గ్రాడ్యుయేషన్ కోర్సుల నాలుగో సెమిస్టర్ పరీక్షలను వాయిదా వేసినట్లు పరీక్షల నియంత్రణ అధికారి రెడ్డి ప్రకాష్‌రావు గురువారం తెలిపారు. ముందుగా ప్రకటించిన షెడ్యూల్ ప్రకారం ఈనెల 27 నుంచి ప్రారంభం కావాల్సిన పరీక్షలను వాయిదా వేశామన్నారు. తిరిగి పరీక్షలు ఏప్రిల్ 2 నుంచి యథావిధిగా కొనసాగుతాయన్నారు. పరీక్షల సమయంలో ఎటువంటి మార్పు లేదని ఉదయం 10:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకు నిర్వహిస్తామని తెలిపారు.

1,44,649 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, మార్చి 7 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు గురువారం 1,25,293 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,44,649 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 89,789 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	9000	20000
నెంబరు. 5	11000	19000
273	12300	15500
341	10000	19000
4884	11000	18500
సూపర్ 10	12500	16500
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	20000
బ్యాడిగి	9500	20000
దేవనూరు డీలక్స్	10000	19000
తెల్లకాయలు	5000	12000

10న మేదరమెట్లలో సీఎం సభకు ఆర్టీసీ క్యూ..

● ఉమ్మడి జిల్లా నుంచి 601 బస్సులు సిద్ధం ● డిపోల్లో సగం బస్సులన్నీ సభకే ● ఇక ప్రయాణీకులకు చుక్కలే..

గుంటూరు, మార్చి 7:ప్రయాణీకుల నుంచి నిరసనలు, విమర్శలు ఎన్ని ఎదురైనా ఆర్టీసీ యాజమాన్యం అధికార వైసీపీ సేవలో తరిస్తోంది. మేదరమెట్లలో ఈనెల 10న అధికార వైసీపీ తలపెట్టిన సిద్ధం సభకు ఉమ్మడి జిల్లాలోని ఆర్టీసీ సర్వీసులు పెద్ద ఎత్తున తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 601 బస్సులకు ప్రతిపాదనలు సిద్ధం చేసినట్లు ఆర్టీసీ అధికార వర్గాలు తెలిపాయి. గుంటూరు జిల్లా పరిధిలోని గుంటూరు-1,2 డిపోలతో పాటు మంగళగిరి, తెనాలి, పొన్నూరు డిపోల నుంచి 193, పల్నాడులోని మాచర్ల, వినుకొండ, నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి, పిడుగురాళ్ళ డిపోల నుంచి 264, బాపట్ల జిల్లాలోని బాపట్ల, చీరాల, అద్దంకి డిపోల నుంచి 144 సర్వీసులు అందుబాటులో ఉంచుతున్నారు. సభ 10న అయినప్పటికీ ముందురోజు ఉదయం నుంచే బస్సులను కేటాయించిన ప్రాంతాలకు తరలించాలని ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేశారు.

రెండు రోజులు ప్రయాణీకులకు చుక్కలే....

ఆదివారం మేదరమెట్లలో సభ కావటంతో ముందు రోజు నుంచే కేటాయించిన ప్రాంతాలకు ఆర్టీసీ సర్వీసులను తరలించాలని అధికారులు ఇప్పటికే ఆదేశాలు జారీ చేశారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 601 బస్సులు కేటాయించటంతో ప్రయాణీకులకు బస్సులు అందుబాటులో లేక చుక్కలు కనిపించనున్నాయి.

మంగళగిరి డిపో నుంచి పల్లెవెలుగు సర్వీసులన్నీ సీఎం సభకే..

సీఎం సభ కోసం డిపోల వారీగా ఇప్పటికే అధికారులు బస్సులను కేటాయించారు. గుంటూరు-1 డిపో నుంచి 64, గుంటూరు-2 నుంచి 44, తెనాలి నుంచి 40, పొన్నూరు నుంచి 22, మంగళగిరి నుంచి 23 బస్సులను కేటాయించారు. కాగా మంగళగిరి డిపోలో అసలు పల్లెవెలుగు సర్వీసులుండే 24 కాగా 23 సర్వీసులను కేటాయించారు. అంటే ఒక పల్లెవెలుగు సర్వీసు మాత్రమే అందుబాటులో ఉంచనున్నారు.

'అగ్నివీర్' రిక్రూట్‌మెంట్ రిజిస్ట్రేషన్ ప్రారంభం

గుంటూరు, మార్చి 7(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని 13 జిల్లాల అభ్యర్థులకోసం అగ్నివీర్ రిక్రూట్‌మెంట్ 2024-25 రిజిస్ట్రేషన్ ప్రక్రి యని ప్రారంభించినట్లు గుంటూరు ఆర్మీ రిక్రూటింగ్ కార్యాలయం రిక్రూటింగ్ డైరెక్టర్ కల్నల్ పునీత్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అగ్నివీరులు వివిధ కేటిగిరీల రిక్రూట్‌మెంట్ కోసం joinindianarmy.nic.in వెబ్‌సైట్‌ద్వారా రిజిస్ట్రేషన్ చేసుకో వచ్చని సూచించారు. గుంటూరు, కర్నూలు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు, అనంతపురం, వైఎస్ఆర్ కడప, ప్రకాశం, చిత్తూరు, బాపట్ల, పల్నాడు, నంద్యాల, తిరుపతి, అన్నమయ్య, శ్రీ సత్యసాయి జిల్లాలకు చెందిన ఆసక్తిగల అభ్యర్థులందరూ అగ్నివీర్ జనరల్ డ్యూటీ, టెక్నికల్, ఆఫీసు అసిస్టెంట్ / స్టోర్ కీపర్, ట్రేడ్స్ మెన్ పోస్టులకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు.





పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయానికి కృషి చేయాలి : కన్నా

సత్తెనపల్లి, మార్చి 7 : రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన విజయానికి హైదరాబాద్‌లో నివాసం ఉంటున్న సత్తెనపల్లి నియోజకవర్గ తెలుగుదేశం, జనసేన కార్యకర్తలు కృషి చేయాలని టీడీపీ అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. గురువారం రాత్రి కూకట్‌పల్లిలో నివాసం ఉంటున్న నియోజకవర్గ టీడీపీ, జనసేన కార్యకర్తల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ అమరావతి రాజధానిగా కొనసాగాలన్నా, రాష్ట్రాభివృద్ధి జరగాలన్నా చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. జనసేన, టీడీపీ కార్యకర్తలు, నేతలు కన్నాను ఘనంగా సన్మానించి జ్ఞాపికలు అందించారు. కార్యక్రమంలో కే.సాంబశివరావు, జీ.వసంతరావు, బీ.వెంకటరావు, ఎం.వెంకటరావు, ఎం.శ్రీనివాసరావు, వీ.నరేంద్ర, నర్రా బాబూరావు, మక్కపాటి రామచంద్రరావు, లగడపాటి గజానన, ఎలినేడి వెంకటేష్, కొండవీటి దత్తాత్రేయులు, వాసిరెడ్డి నరేంద్ర, పత్తిపాటి త్రినాథ్, మేడేపల్లి మోహన్, పాతూరి సుబ్బారావు, పాతూరి వెంకటరావు, పద్మ చౌదరి, గుంటూరు ఆశీర్వాదం, ఎలినేడి సాంబశివరావు, మిరియాల శివ ప్రసాదు పాల్గొన్నారు.

పారిశుధ్య నిర్వహణలో పురపాలక సంఘం విఫలం : రంగిశెట్టి

సత్తెనపల్లి, మార్చి 7 : పురపాలక సంఘంలో రూ.25 కోట్ల బడ్జెట్ ప్రవేశ పెడుతున్నా పారిశుధ్య నిర్వహణ విషయంలో పురపాలక సంఘం పూర్తిగా విఫల మైందని 7వ వార్డు కౌన్సిలర్ రంగిశెట్టి సుమన్ ఆరోపించారు. పురపాలక సంఘ సమావేశం గురువారం చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీతులసీ అధ్యక్షతన జరిగింది. కౌన్సిలర్ సుమన్ మాట్లాడుతూ సంవత్సరానికి రూ.12 లక్షలు బ్లీచింగ్‌కు కేటాయిస్తున్నారని, ఏ వార్డులో కూడా బ్లీచింగ్ చల్లిన దాఖలాలు లేవన్నారు. పట్టణంలోని పలు ప్రాంతాల్లో అధ్వాన పారిశుధ్యంతో దోమలు వృద్ధి చెంది ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. దీనిపై మునిసిపల్ కమిషనర్ షమ్మి మాట్లాడుతూ దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయిస్తున్నామన్నారు. 31వ వార్డు కౌన్సిలర్ తురగా మేరీ గ్రేస్ ఎజెండాలోని బడ్జెట్‌కు సంబంధించిన వివిధ అంశాలపై అనుమానాలను వ్యక్తం చేశారు. మునిసిపల్ కమిషనర్ షమ్మి ఆమె అనుమానాలను నివృత్తి చేశారు. 2023-24 సవరించిన అంచనా బడ్జెట్, 2024-25 సవరించిన అంచనా బడ్జెట్ ముగింపు నిల్వ రూ.25,07,98,131 చూపిస్తూ సమావేశంలో కౌన్సిలర్లు ఏకగ్రీవంగా బడ్జెట్‌ను ఆమోదించారు. ఈ సమావేశంలో మునిసిపల్ వైస్ చైర్మన్ నాగుల్ మీరాన్, కోటేశ్వరరావు నాయక్, కౌన్సిలర్లు కటకం రామకృష్ణ, కంభంపాటి అబ్రహం, జానీ బాషా, బండి రాజ్యలక్ష్మి, సలాం, పెద్దింటి గోవిందమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్రశాలలో భారీ బందోబస్తు : డీఎస్పీ

రెంటచింతల, మార్చి 7 : మహా శివరాత్రి పర్వదిన్నాన్ని పురస్కరించుకుని ప్రముఖ శైవక్షేత్రమైన సత్రశాలలో భారీ బందోబస్తును ఏర్పాటు చేసినట్లు గురజాల సబ్ డివిజన్ పోలీసు ఆఫీసర్ ఎ.పల్లపు రాజు చెప్పారు. గురువారం ఆయన మాట్లాడుతూ భక్తుల సౌకర్యార్థం ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు చేపట్టామన్నారు. నది ఒడ్డున ఘాట్లను ప్రాజెక్టు ఎస్ఈ వేంకటరమణతో కలిసి ఎస్ఐ పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఐ కేవీ నారాయణరెడ్డి ఉన్నారు.

నేడు బ్రహ్మారెడ్డి సత్రశాల రాక

రెంటచింతల, మార్చి 7 : టీడీపీ నియోజకవర్గ అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి శుక్రవారం సత్రశాలలో పర్యటించనున్నట్లు ఆ పార్టీ మండల అధ్యక్షుడు చపారపు అబ్బిరెడ్డి, మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షుడు గొంటు సుమంత్‌రెడ్డి తెలిపారు. మహా శివరాత్రి పురస్కరించుకొని శ్రీగంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. అనంతరం పార్టీ నేతలు, కార్యకర్తలతో ఉదయం 10 గంటలకు సమావేశమవుతారన్నారు.

నేడు ధనమల్లయ్య స్వామి తిరునాళ్ల

కారంపూడి, మార్చి 7 : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని శుక్రవారం మండలంలోని ఒప్పిచర్ల గ్రామ శివారులో గల కొండల్లో ఉన్న శ్రీధనమల్లయ్య స్వామి తిరునాళ్లను వైభవంగా నిర్వహించనున్నారు. స్వామి వారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల కోసం భారీ అన్నదానం నిర్వహించనున్నారు.

వైభవంగా ప్రారంభమైన మహాశివరాత్రి ఉత్సవాలు



పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తెగా కపోతేశ్వర స్వామి, గంగా భ్రమరాంభ పార్వతి

నకరికల్లు, మార్చి 7 : చేజర్ల కపోతేశ్వర స్వామి దేవాలయంలో గురువారం మహాశివరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. గణపతి పూజతో పూజా కార్యక్రమాలను ప్రారంభించారు. కపోతేశ్వరస్వామిని పెండ్లి కుమారునిగా, గంగా భ్రమరాంభ పార్వతిని పెండ్లి కుమార్తెగా అలంకరించారు. ఉత్సవ మూర్తుల అలంకరణను తిలకించేందుకు భక్తులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. ఉత్సవ ఏర్పాట్లను ఆలయ ఈవో వై వెంకయ్య పర్యవేక్షిస్తున్నారు. పూజా కార్యక్రమాలను ఆలయ అర్చక స్వామి కొండకావూరి వెంకట్రామయ్య శర్మ పూజా కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. దేవాలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబు చేశారు.

అనుమతులు లేని క్వారీలపై కేసులు

దాచేపల్లి, మార్చి 7 : ఇష్టారాజ్యంగా అక్రమ మైనింగ్ చేస్తూ బిల్లులు లేకుండా యథేశ్చగా నాపరాయి తరలిస్తున్న క్వారీల వాహనాలపై మైనింగ్ అధికారులు కేసులు నమోదు చేస్తున్నారు. దాచేపల్లి మండలంలో అధికార పార్టీ నేతల అండదండలతో మైనింగ్ పరిమితులు, లీజు, పర్యావరణశాఖ అనుమతులు, బ్లాస్టింగ్‌కు అనుమతులు ఇవేమి లేకుండానే తవ్వకాలు జరుగడం నిత్యకృత్యంగా మారాయి. కొద్దిరోజుల క్రితం మైనింగ్‌శాఖ అధికారులు క్వారీలపై దృష్టి సారించడంతో రూ.12 కోట్లకు పైగా అపరాధ రుసుం విధించారు. గురువారం మైనింగ్ అధికారులు ట్రాక్టర్లను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసేందుకు చర్యలు చేపట్టారు.

20 లీటర్ల నాటుసారా స్వాధీనం

మాచర్ల రూరల్, మార్చి 7 : పట్టణంలోని రైల్వే గేటు సమయంలో నాటు సారా కలిగి ఉన్న మొగిలి వెంకయ్య, తంగెళ్ల నాగరాజులను గురువారం మాచర్ల సెబ్ అధికారులు అదుపులోకి తీసుకున్నారు. వీరి వద్ద నుంచి 20 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకున్నారు. వీరిని న్యాయాధికారి ఎదుట హాజరుపరుచగా రిమాండ్ విధించారు.

పాఠశాలలను సందర్శించిన డీఈవో



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న డీఈవో వెంకటేశ్వర్లు

కారంపూడి, మార్చి 7 : మండలంలోని మిర్యాలలో గల జడ్పీహెచ్ఎస్, ఎంపీపీఎస్ పాఠశాలను గురువారం డీఈవో వెంకటేశ్వర్లు సందర్శించారు. పబ్లిక్ పరీక్షలకు సమాయత్తమయ్యేందుకు పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఎంపీపీఎస్ పాఠశాలలో మధ్యాహ్న భోజనం చేసి సంతృప్తిని వ్యక్తం చేశారు. పాఠశాలలో ముగ్గురు ఉపాధ్యాయులకు ఒకే రోజు సెలవు ఇవ్వడంపై హెచ్ఎంకు మెమో జారీ చేశారు. ఆయన వెంట ఎంఈవో కాంతారావు ఉన్నారు.

ఆరు పథకాలతో ప్రతి ఒక్కరికి మేలు

● మాజీ ఎమ్మెల్యే యరపతినేని



సమావేశంలో మాట్లాడుతున్న యరపతినేని

పిడుగురాళ్ల, మార్చి 7: టీడీపీ జనసేన ఉమ్మడి మేనిఫెస్టోగా బాబు సూపర్ 6 పథకాలతో ప్రతి ఒక్కరికి ఎంతో లబ్ధి చేకూరుతుం దని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. పిడుగురాళ్లలో గురజాల నియోజకవర్గ క్లస్టర్స్, బూత్ కన్వీ నర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. యరపతినేని మాట్లా డుతూ అలవికాని హామీలతో అధికారం లోకి వచ్చిన జగన్ రాష్ట్రానికి రాజధాని లేకుండా చేశాడని, భూహక్కు చట్టంతో ప్రతి ఒక్కరికి ఇబ్బందులు కలుగుతున్నాయన్నారు. యరపతినేని నిఖిల్ మాట్లాడు తూ ఐదేళ్లుగా అన్నివర్గాలను వైసీపీ మోసం చేస్తున్న వైనాన్ని వివ రించి బాబు అధికారంలోకి వస్తేనే ప్రతిఒక్కరికి సంక్షేమం కొనసాగు తుందన్నారు. గుంటుపల్లి నాగేశ్వరరావు మాట్లాడుతూ బీసీ డిక్లరేషన్ కమిటీలో తనకు అవకాశం ఇచ్చేలా చేసిన యరపతినేని శ్రీనివాసరావుకు నియోజకవర్గంలోని బీసీ వర్గాలతో పాటు అన్ని వర్గాల ప్రజలు అండగా వుంటారన్న విషయాన్ని గుర్తు చేశారు.

గురజాలకు సూపర్ 6 పథకాలు

గురజాల నియోజకవర్గానికి యరపతినేని శ్రీనివాసరావు సూపర్ 6 పథకాలను ప్రకటించారు. వాటిలో ఒకటి గురజాల కేంద్రంగా పల్నాడు జిల్లా ఏర్పాటు, రెండవది ప్రతి ఇంటికి ఏడాదికి ఒక సిలిండర్, మూడవది నియోజకవర్గంలో లక్షా 50 వేల మందికి రూ.10 లక్షల విలువైన చంద్రన్న బీమా ప్రీమియం చెల్లింపు, నాల్గవది ముస్లిల హజ్‌యాత్రకు రూ.లక్ష ఆర్థిక సహాయం, ఐదవది వేళాంగణి మాత దర్శనం కోసం ఉచిత బస్సు ప్రయాణ ఏర్పాటు, ఆరవది యూత్ పాలసీ ఏర్పాటుతో 500 ఎకరాలలో డిగ్రీ, బీటెక్ చదివిన వారికి ఉద్యోగ, ఉపాధి అవకాశాల ద్వారా 15 వేల మందికి అవకాశం కల్పించడం జరుగుతుందని యరపతినేని శ్రీనివాసరావు తెలియజేశారు. ఈ సమావేశంలో నియోజకవర్గ పరిశీలకులు వసంత సత్యనారాయణ, కర్నాటి వరలక్ష్మీ, షేక్ బాబావలి, తురకా వీరస్వామి, సయ్యద్ అమీర్‌అలి, అక్కినపల్లి బాలయ్య, పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, బెల్లంకొండ భద్రి, గండికోట వెంకటేశ్వర్లు, బడిగుంచల వెంకటేశ్వర్లు, మేకల సాంబశివరావు, పోటు నాగేశ్వరరావు, జమ్మిగుంపుల లక్ష్మీనారా యణ, కామిశెట్టి రమేష్, ఖాశింసైదా, మునగా వెంకట్, వేముల వినోద్‌రెడ్డి, వేముల ఆంజనేయులు, వల్లెపు రామకృష్ణ, నేలవల్లి బొల్లయ్య, పణితి రవి, పిల్లి చెన్నారావు, దియ్యా రామకృష్ణ, వడ్డ వల్లి సాంబశివరావు, పాదర్తి రాజేశ్వరి, పరుచూరి వెంకట రమణ, రావి వెంకటరమణ పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన 12 కుటుంబాలు

పిడుగురాళ్ల, మార్చి 7: పిడుగురాళ్ల టీడీపీ కార్యాలయంలో గురువారం శంకరాపురంనకు చెందిన 12 కుటుంబాల వారు గామాలపాడు టీడీపీ, జనసేన పార్టీ నాయకుల ఆధ్వర్యంలో మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో టీడీపీలో చేరారు. వారందరికీ పార్టీ కండువా కప్పి ఆహ్వానించిన యరపతినేని తగిన గుర్తింపు ఇస్తానని భరోసా ఇచ్చారు. పార్టీలో చేరిన వారిలో ఎస్టీ సామాజికవర్గ నేతలు భూక్యా బాలానాయక్, భూక్యా సైదులు నాయక్, రవినాయక్, భూక్యా చక్రినాయక్, పున్నానాయక్, వెంకటేశ్వరనాయక్, రాములునాయక్, పార్వతీభాయి, పూర్ణాభాయి, సోములు నాయక్, చట్టు వెంకటరావు, నాగులునాయక్ తదితరులు ఉన్నారు. గుంటుపల్లి నాగేశ్వరరావు, బెల్లంకొండ భద్రి, అక్కినపల్లి బాలయ్యతో పాటు పలువురు ముఖ్యులు పాల్గొన్నారు.

అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపండి : యరపతినేని

గురజాలటౌన్, మార్చి 7 : రాష్ట్రంలో అరాచక పాలన నడుస్తోందని, ప్రజలందరూ ఏకమై ఈ అరాచక రాక్షస ప్రభుత్వాన్ని గద్దె దింపాలని గురజాల మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బాబుషూరిటీ భవిష్యత్తు గ్యారంటీలో భాగంగా గురువారం మండలంలోని గంగవరంలో టీడీపీ, జనసేన నేతలతో కలిసి ఇంటింటికి తిరుగుతూ మేనిఫేస్టోను వివరించారు. గ్రామస్తులు యరపతినేనికి ఘన స్వాగతం పలికారు. మహిళలు హారతులిచ్చారు. ఎప్పుడు ఎన్నికలు జరిగినా సైకో ముఖ్యమంత్రిని గద్దె దింపేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ, పట్టణ అధ్యక్షుడు అడపా శ్రీనివాసరావు, పేరుపోగు మరియబాబు, గుండాల మల్లీశ్వరి, జనసేన నేతలు కటికం అంకారావు, బడిదెల శ్రీనివాసరావు, ఉప్పిడి నరసింహారావు, చింతకాయల కల్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

ట్రాక్టర్ ట్రక్కు బోల్తా : 15 మంది కూలీలకు గాయాలు



బోల్తా పడిన ట్రాక్టర్ ట్రక్కు

క్రోసూరు, మార్చి 7 : మండలంలోని 88 తాళ్ళూరు గ్రామం వద్ద మిర్చి కూలీలతో వెళ్తున్న ట్రాక్టర్ ట్రక్కు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో ట్రక్కులో ఉన్న 15 మంది కూలీలకు గాయాలయ్యాయి. వారిలో ఐదుగురికి తీవ్ర గాయాలయ్యాయి. క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లలో సత్తెనపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. సత్తెనపల్లిలో ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన చికిత్స కోసం గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. గాయపడ్డ కూలీలందరూ కర్నాటక రాష్ట్రానికి చెందిన వారుగా చెపుతున్నారన్నారు. మిర్చి కోతల కోసం సత్తెనపల్లి మండలం భట్లూరు గ్రామానికి వచ్చారని, చుట్టు పక్కల గ్రామాలకు మిర్చి కోతలకు వెళ్తుంటారని స్థానికులు తెలిపారు. క్రోసూరు పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు నమోదు చేసుకున్నారు.

శివరాత్రికి ఆర్టీసీ ప్రత్యేక సర్వీసులు

సత్తెనపల్లి, మార్చి 7 : మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఈనెల 8వ తేదీ సత్తెనపల్లి ఆర్టీసీ డిపో నుంచి కోటప్పకొండ, అమరావతికి ప్రత్యేక బస్సు సర్వీసులను ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ జీ.విజయకుమార్ గురువారం విలేకరులకు తెలిపారు. సత్తెనపల్లి నుంచి అమరావతికి 10, కోటప్పకొండకు 18 ప్రత్యేక బస్సు సర్వీసులను ఉదయం 4 గంటల నుంచి కొనసాగిస్తామన్నారు.

శివరాత్రికి ఏర్పాట్లు

మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని అచ్చంపేట రోడ్డులోని శివాలయంలో శివరాత్రి నిర్వహణకు ఆలయ నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు. పాత శివాలయంలో, సనారి వీరబ్రహ్మేంద్ర స్వామి ఆశ్రమంలో కూడా మహాశివరాత్రి నిర్వహణకు ఏర్పాట్లు చేశారు.

మహాశివరాత్రి ఉత్సవాలకు నిరంతర విద్యుత్ సరఫరా

అమరావతి, మార్చి 7 : మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకుని అమరావతి పుణ్యక్షేత్రంలో మూడు రోజుల పాటు నిరంతర విద్యుత్ సరఫరా చేసేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు ఏపీసీపీడీసీఎల్ టెక్నికల్ డైరక్టర్ బి.జయభారత్‌రావు తెలిపారు. అమరేశ్వరాలయం వద్ద ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్‌లను గురువారం సాయంత్రం పరిశీలించి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తాడికొండ, రాయపూడి సబ్‌స్టేషన్‌ల నుంచి విద్యుత్ సరఫరా చేయడం జరుగుతుందన్నారు. దేవస్థాన పరిధిలో జనరేటర్ అందుబాటులో ఉందన్నారు. విద్యుత్ సరపరా పర్యవేక్షణకు నలుగురు అసిస్టెంట్ ఇంజనీర్లు, ఒక డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీరును నియమించడం జరిగిందన్నారు.సీఆర్‌డీఏ సూపరింటెండెంట్ ఇంజనీరు డాక్టర్ పి.విజయకుమార్, ఎగ్జిక్యూటివ్ ఇంజనీరు టి.తులసీరాం, ఏడీఈ కోటేశ్వరరావు, ఏఈ అశోక్‌కుమార్, ఎల్ఐ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిర్మాణమే పూర్తి కాలేదు.. ప్రారంభించేశారు

● విస్మయం వ్యక్తం చేస్తున్న నేతి వెంకన్నస్వామి భక్తులు

రాజుపాలెం, మార్చి 7 : నవ్విపోదురు గాక మాకేంటి అన్న చందంగా వ్యవహరించారు వైసీపీ నేతలు, అధికారులు. నిర్మాణం మొత్తం పూర్తి కాలేదు.. కనీసం శ్లాబ్‌కు అమర్చిన సెంట్రింగ్‌ను పూర్తి స్థాయిలో తొలగించనులేదు. నిర్మాణ పనులు మొత్తం పూర్తి చేసినట్లు మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. మండలంలోని దేవరంపాడు కొండపై ఉన్న శ్రీనేతి వెంకన్న స్వామి దేవస్థానంలో ముఖ మండపం నిర్మాణ నిమిత్తం దేవదాయ శాఖ రూ.99 లక్షల నిధులను మంజూరు చేసింది. రేపోమాపో సార్వత్రిక ఎన్నికల కోడ్ వస్తుందనే ఉద్దేశ్యంతో ముఖ మండపం తుది మెరుగులు లేకుండానే గురువారం మంత్రి అంబటి రాంబాబు చేతుల మీదుగా ప్రారంభించారు.



శ్లాబ్‌కు అమర్చిన సెంట్రింగ్‌ను తొలగిస్తున్న కూలీలు

వేమారెడ్డికి పలువురి నివాళి

సత్తెనపల్లి, మార్చి 7 : మండలంలోని పెదమక్కెనకు చెందిన వైసీపీ నేత వద్దుల వేమారెడ్డి పెద్ద కర్మ గురువారం జరిగింది. ఈ కార్యక్రమంలో సత్తెనపల్లి నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, మంత్రి అంబటి రాంబాబు, పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వద్దుల వెంకట శ్రీనివాసరెడ్డి, వద్దుల కృష్ణారెడ్డి, వద్దుల కొండారెడ్డి, వద్దుల సీతారావమ్మ, సూరెడ్డి సరోజారాణి, శ్రీనివాసరెడ్డి, మహేష్‌రెడ్డి, యశ్వంత్‌రెడ్డి, కిషన్ అవనీష్‌రెడ్డి, కోటిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు, పవన్ కళ్యాణ చిత్రపటాలకు పాలాభిషేకం

సత్తెనపల్లి, మార్చి 7 : బీసీలకు రైన ప్రాధాన్యత తెలుగుదేశం, జనసేన పార్టీల ద్వారానే సాధ్యమని గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు, టీడీపీ సత్తెనపల్లి నియోజక వర్గ పరిశీలకులు తాతా జయ ప్రకాష్ నారాయణ, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహణ కార్యదర్శి ఎలినేడి రామస్వామి అన్నారు. టీడీపీ, జనసేన బీసీ డిక్లరేషన్ చేసిన నేపథ్యంలో కృతజ్ఞతగా గురువారం సాయంత్రం పట్టణంలోని టీడీపీ ప్రజా వేదికలో చంద్రబాబు నాయుడు, పవన్ కళ్యాణ్ చిత్రపటాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీకి బీసీలే వెన్నెముక అన్నారు. వైసీపీ పాలనలో బీసీల పై దాడులు, దౌర్జన్యాలు, హత్యలు, అత్యాచారాలు పెరిగాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు చౌట శ్రీనివాసరావు, పూజల వెంకట కోటయ్య, నూర్ బాషా జానీ బాబు, సాగి కోటేశ్వరరావు, మార్కెట్ రాజు, పత్తిపాటి హరేకృష్ణ, దివ్వెల శ్రీనివాసరావు, మారెళ్ళ మల్లేశ్వరరావు తదితర టీడీపీ నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

ఓర్వకల్లు అమ్మవారి ఆలయంలో భాష్యం ప్రవీణ్ పూజలు

అచ్చంపేట, మార్చి 7 : మండలంలోని ఓర్వకల్లు గంగమ్మ అమ్మవారి ఆలయంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు భాష్యం ప్రవీణ్ గురువారం రాత్రి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ పూజారి స్వాగతం పలికి సాదరంగా ఆహ్వానించారు. సుమారు రెండు వేల మందికి పైగా టీడీపీ అభిమానులు, కార్యకర్తలు పాల్గొన్నారు. పూజల అనంతరం నాయకులు, కార్యకర్తలతో మాట్లాడారు. ముందుగా పోలూరు అడ్డరోడ్డు వద్ద నుంచి భారీ వాహనర్యాలీ నిర్వహించారు. నియోజకవర్గం నుంచి భాష్యం ప్రవీణ్ అభిమానులు పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు.

గ్రామాల అభివృద్ధే వైసీపీ ధ్యేయం : ఎమ్మెల్యే పీఆర్కే

కారంపూడి, మార్చి 7: గ్రామాల అభివృద్ధే వైసీపీ ధ్యేయమని ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని పేటసన్నిగండ్లలో రూ. 4.5 కోట్లతో నూతనంగా నిర్మించనున్న 33/11కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి ఆయన భూమిపూజ నిర్వహించారు. అలాగే గ్రామంలో రూ.43.60 లక్షలతో నూతనంగా నిర్మించిన సచివాలయం, రూ.20.80 లక్షలతో ఏర్పాటు చేసిన విలేజ్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే పీఆర్కే ప్రారంభించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బొమ్మిన సావిత్రి అల్లయ్య, మాజీ ఎంపీపీ మేకల శారదా శ్రీనివాసరెడ్డి, జడ్పీటీసీ షేక్ షఫి, వైసీపీ మండల కన్వీనర్ కొంగర సుబ్రహ్మణ్యం, యూత్ కన్వీనర్ చిలుకూరి చంద్రశేఖరరెడ్డి, కోఆప్షన్ సభ్యుడు ఏసోబు, మాజీ సర్పంచ్ ఉన్నం గిరి, ఎంపీడీవో శ్రీనివాస రెడ్డి, ఈవోపీఆర్డీ సత్యప్రసాద్ పాల్గొన్నారు.

ట్రాలీ వాహనం ప్రారంభం

మాచర్ల రూరల్, మార్చి 7: మండలంలోని అచ్చమ్మకుంటకు చెందిన సురేష్ నాయక్ ఎస్సీ, ఎస్టీ జగనన్న వైఎస్ఆర్ బడుగు వికాశం పథకం కింద సబ్సిడీ ద్వారా నూతనంగా ట్రాలీ వాహనాన్ని కొనుగోలు చేశారు. పట్టణంలోని వైసీపీ కార్యాలయం వద్ద గురువారం ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి ప్రారంభించారు.

శేషారెడ్డి మృతదేహానికి నివాళి

పట్టణంలోని 23వ వార్డుకు చెందిన నాగిరెడ్డి శేషారెడ్డి అనారోగ్య కారణాలతో గురువారం మరణించారు. ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డి వార్డుకు చేరుకొని శేషారెడ్డి భౌతికకాయం వద్ద నివాళులర్పించారు. కుటుంబసభ్యులను పరామర్శించారు.

పలువురికి నివాళులర్పించిన కన్నా నాగరాజు

సత్తెనపల్లి, మార్చి 7 : మండలంలోని రెంటపాళ్ళ గ్రామానికి చెందిన టీడీపీ కార్యకర్త పువ్వాడ సాంబశివరావు గురువారం మరణించారు. సాంబశివరావు గృహానికి గుంటూరు నగర మాజీ మేయర్, టీడీపీ నేత కన్నా నాగరాజు వెళ్ళి ఆయన మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పట్టణంలోని 27వ వార్డుకు చెందిన టీడీపీ కార్యకర్త సయ్యద్ కరిముల్లా మృతదేహాన్ని సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఆయన వెంట పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

మహిళలతోనే సాధికారిత సాధ్యం

నకరికల్లు, మార్చి 7 : మహిళలతోనే మహిళా సాధికారిత సాధ్యమవుతుందని చేజర్ల హైస్కూల్ గణిత ఉపాధ్యాయుడు గేరా మోహనరావు అన్నారు. ఈనెల 8వ తేదీ అంతర్జాతీయ మహిళా దినోత్సవం పురస్కరించుకొని చేజర్ల జెడ్పీ హైస్కూల్‌లో గురువారం మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు. హెచ్ఎం షేక్ పాహిం మాట్లాడుతూ లింగ సమానత్వం ద్వారా మహిళల్లో అవకాశాలు పెంపొందుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్.లలిత, పఠాన్ మల్లిక, చెరుకూరి వెంకటేశ్వర్లు, షేక్ మస్తాన్‌వలి, ఏసీహెచ్ వెంకటరావు, బత్తుల సుందరరావు, షేక్ హబీబ్, షేక్ గౌస్‌లు పాల్గొన్నారు.

శివరాత్రి శుభాకాంక్షలు తెలిపిన నేతలు

సత్తెనపల్లి, మార్చి 7 : మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని సత్తెనపల్లి నియోజకవర్గ ప్రజలకు, పార్టీ నేతలకు, కార్యకర్తలకు, అభిమానులకు టీడీపీ, జనసేన ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ గురువారం శుభాకాంక్షలు తెలిపారు. మాజీ ఎమ్మెల్యేలు యర్రం వెంకటేశ్వరరెడ్డి, వైవీ ఆంజనేయులు, టీడీపీ నేతలు ఎలినేడి రామస్వామి, నాగోతు శౌరయ్య, కనుమూరి బాజీ చౌదరిలు కూడా నియోజకవర్గ ప్రజలకు మహాశివరాత్రి శుభాకాంక్షలను తెలియజేశారు.

రాష్ట్రం 30 ఏళ్లు వెనక్కు : యాగంటి

దుర్గి, మార్చి 7 : వైసీపీ అధికారంలోకి వచ్చాక రాష్ట్రం 30 ఏళ్ల వెనక్కుపోయిందని టీడీపీ సీనియర్ నేత, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాల మేరకు బుధవారం రాత్రి దుర్గితోపాటు శ్యామరాజపురంలో నిర్వహించిన బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారంటీలో ఆయన పాల్గొని మాట్లాడారు. కాగా గ్రామానికి చెందిన 25 వైసీపీ కుటుంబాలు గురువారం ఆ పార్టీని వీడి టీడీపీలో చేరారు. వీరికి యాగంటి పార్టీ జెండాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో సింగు నాగేశ్వరరావు, చప్పిడి రాము, దుర్గెంపూడి జానకిరామయ్య, బట్టు శ్రీను, బత్తుల సీతయ్య పాల్గొన్నారు.

● కారంపూడి, మార్చి 7: రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేన గెలుపు ఖాయమని, రానున్నది మన ప్రభుత్వమేనని టీడీపీ నియోజకవర్గ వాణిజ్య విభాగం కార్యదర్శి పంగులూరి పుల్లయ్య అన్నారు. టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డి ఆదేశాల మేరకు మండలంలోని ఒప్పిచర్లలో గురువారం బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. టీడీపీ, జనసేన ప్రభుత్వంలో ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నేతలు పాల్గొన్నారు.

● మాచర్ల రూరల్, మార్చి 7: పట్టణంలోన 11వ వార్డులో గురువారం టీడీపీ, జనసేన నేతలు బాబు షూరిటీ - భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికి తిరిగి పార్టీ మేనిఫేస్టోను వివరించారు. రానున్న ఎన్నికల్లో టీడీపీ, జనసేనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ పట్టణ అధ్యక్షుడు కొమెర దుర్గారావు, మార్కెట్ మాజీ చైర్మన్ యాగంటి మల్లికార్జునరావు, ఎస్టీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు వజ్రం నాయక్, బొట్టు కోటేశ్వరరావు, తిక్కా కొండలు, సుభాని, దుర్భాకుల ప్రసాద్, గాజుల ఆంజనేయులు, శ్రీనివాస చారి, బండారు కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

● బెల్లంకొండ, మార్చి 7 : బెల్లంకొండ బీసీ కాలనీలో గురువారం బాబు ష్యూరిటీ.. భవిష్యత్తుకు గ్యారెంటీ కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ముఖ్య అతిథిగా రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్ హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలోనే బీసీలకు సముచిత స్థానం లభించిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ జ్యోతి సముద్రం, వైస్ సర్పంచ్ మునగపాటి సుభానీ, మాజీ సర్పంచ్ సయ్యద్ జానీ, టీడీపీ నాయకులు పీఎస్‌కే రసూల్, పెద్ద హయూం, సలాం, సయ్యద్ జబ్బార్, ఎన్ పిచ్చయ్య, గురవయ్య, గుంజా గంగారావు, తెల్లమేకల నాగేశ్వరరావు, పాపయ్య, వీరాస్వామి, బులెక్కయ్య పాల్గొన్నారు.

● పిడుగురాళ్ల, మార్చి 7: బాబు ష్యూరిటీ - భవిష్యత్ గ్యారంటీ, బాబు సూపర్ 6 పథకాలపై గురువారం పట్టణంలోని పలు వార్డుల్లో టీడీపీ జనసేన నాయకులు, మహిళలు ఉమ్మడి ప్రచారం నిర్వహించారు. పట్టణ అధ్యక్షుడు పాండురంగ శ్రీను, వడ్డవల్లి సర్వేశ్వరరావు, సాంబశివరావు, సయ్యద్ అమీర్‌అలి, తెలుగు మహిళా అధ్యక్షురాలు చల్లగుండ్ల సీత, రూరల్ అధ్యక్షురాలు పర్చూరి వెంకటరమణ, రాజేశ్వరి, శారద, లక్ష్మీ, అంజమ్మ, నాయకులు పాల్గొన్నారు.

పవన్‌కల్యాణ్ వ్యక్తిగత సిబ్బంది అపార్ట్‌మెంట్లో సోదాలు దుర్మార్గం

మాచర్ల రూరల్, మార్చి 7 : జనసేన అధినేత పవన్ కల్యాణ్ వ్యక్తిగత సిబ్బంది అపార్ట్‌మెంట్లో మంగళగిరి పోలీసులు దాడులు జరపడం దుర్మార్గమని జనసేన పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త బూసా రామాంజినేయులు అన్నారు. పట్టణంలోని జనసేన కార్యాలయంలో గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. తాడేపల్లి ప్యాలెస్ పెద్దల ప్రోద్బలంతోనే ఈ దాడులు జరిగాయన్నారు. మంగళగిరి పోలీసులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయన వెంట జనసేన నియోజకవర్గ అధికార ప్రతినిధి నక్షత్రపు ప్రసాద్, జిల్లా కార్యదర్శి పులి హరి తదితరులు ఉన్నారు.

సాగర్ జలాలతో చెరువులకు నీరు

మాచవరం, మార్చి 7: గత నాలుగు రోజులుగా వస్తున్న సాగర్ జలాలతో మాచవరం మండలంలోని పలు గ్రామాల చెరువులకు నీరు నింపుతున్నారు. గురువారం మాచవరం సర్పంచ్ రాగిడి నరేష్ మాచవరం ఊరచెరువుకు నీటిని నింపేందుకు ఎక్స్‌కవేటర్ సహాయంతో కాల్వలు తీసి చెరువుకు నీరు నింపుతున్నారు. అదేవిధంగా మోర్జంపాడు, వేమవరం, రాళ్లబండి వాగుకు నీరు నింపేందుకు ఆయా గ్రామాల ప్రజలు ప్రయత్నాలు ముమ్మరంగా చేస్తున్నారు.

అంకాలమ్మ అమ్మవారి ఆలయం వద్ద బోరు ఏర్పాటు

కారంపూడి, మార్చి 7 : కారంపూడి అంకాలమ్మ ఆలయం వద్ద గురువారం పలువురు దాతలు మంచినీటి బోరును ఏర్పాటు చేశారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తుల సౌకర్యార్థం నీటి వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో పలిశెట్టి వెంకటేశ్వర్లు, మాజీ మున్సుబ్ కోటేశ్వరరావు, పెదకాపు బొమ్మిన కొండలు, చింతల శ్రీనివాసరావు, గుండా ప్రసాద్ పాల్గొన్నారు.



నాకు నేనే కొత్తగా అనిపించా

సుహాస్



సుహాస్ హీరోగా రూపొందుతున్న సస్పెన్స్ థ్రిల్లర్ 'ప్రసన్నవదనం'. పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కథానాయికలు. డైరెక్టర్ సుకుమార్ శిష్యుడు అర్జున్ వై.కె. దర్శకుడిగా పరిచయమవుతున్నారు. కె.ఎస్.మణికంఠ, టి.ఆర్.ప్రసాద్‌రెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. గురువారం జరిగిన టీజర్ రిలీజ్ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న దర్శకుడు సాయిరాజేశ్ మాట్లాడుతూ 'సుహాస్‌కి చాలా కీలకమైన సినిమా ఇది. కథలోని పాయింట్ అదిరిపోయింది. టీజర్ చాలా బాగుంది. తప్పకుండా హిట్ అవుతుంది' అన్నారు. హీరో సుహాస్ మాట్లాడుతూ 'ఫేస్ బ్లైండ్ నెస్ మీద తీస్తున్న మంచి థ్రిల్లర్ ఇది. బాగా వచ్చింది. ఇందులో నాకు నేనే కొత్తగా అనిపించాను. నిర్మాతలు మణికంఠ, ప్రసాద్ ఎంతో కష్టపడ్డారు. ఇది పక్కాగా బ్లాక్‌బస్టర్ అయ్యే సినిమా. అందులో డౌట్ లేదు' అన్నారు. ఈ కథకు సుహాస్ యాప్ట్ అని దర్శకుడు అర్జున్ తెలిపారు. త్వరలో సినిమాను విడుదల చేస్తామని నిర్మాతలు చెప్పారు. హీరోయిన్లు పాయల్ రాధాకృష్ణ, రాశీసింగ్ కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

రాధికకు విశిష్ట మహిళా పురస్కారం



సీనియర్ నటి రాధికకు ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం 2024 విశిష్ట మహిళ పురస్కారాన్ని ప్రదానం చేయనుంది. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాధికను సన్మానించి పురస్కారం ప్రదానం చేస్తామని వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య బి.కరుణ గురువారం తెలిపారు. మంచి నటిగానే కాకుండా నిర్మాతగా కూడా పేరు తెచ్చుకున్న రాధిక తెలుగు, తమిళ చిత్రాలతో పాటు బుల్లి తెరపై కూడా రాణిస్తున్నారు.

- ఆంధ్రజ్యోతి, పెదకాకాని

అన్ని రకాల ఎమోషన్స్‌తో...



యూత్‌ఫుల్ చిత్రాల నిర్మాత బెక్కెం వేణుగోపాల్, సృజన్ కుమార్ బొజ్జంతో కలసి రూపొందిస్తున్న చిత్రం 'రోటీ కపడా రొమాన్స్'. హర్ష నర్రా, సందీప్ సరోజ్, తరుణ్, సుప్రజ్ రంగా, సోనూ ఠాకూర్, నువ్వేక్ష, మేఘ లేఖ, ఖుష్బూ చౌదరి హీరో హీరోయిన్లు. విక్రమ్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రానికి సంబంధించిన ప్రచార చిత్రాలకు మంచి స్పందన వచ్చింది. తాజాగా, ఈ చిత్రం రిలీజ్ డేట్‌ను ఖరారు చేస్తూ బుధవారం ప్రెస్ మీట్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నిర్మాత బెక్కెం వేణుగోపాల్ మాట్లాడుతూ "కథను నమ్మి ఎమోషనల్‌గా ఫీల్ అయి చేసిన సినిమా ఇది. ఏప్రిల్ 12న చిత్రాన్ని విడుదల చేస్తున్నాం" అని అన్నారు. దర్శకుడు విక్రమ్ మాట్లాడుతూ "దర్శకుడిని కావాలన్న నా 15 ఏళ్ల కల ఈ చిత్రంతో తీరుతోంది. ఇది అందరూ అనుకున్నట్లు కేవలం ఎంటర్టైనర్ మాత్రమే కాదు.. అన్ని రకాల ఎమోషన్స్ ఇందులో ఉన్నాయి" అని అన్నారు.













పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

కోటప్పకొండ తిరునాళ్ళకు పట్టణం ముస్తాబు



పట్టణంలోని మహాశివుని విగ్రహం

నరసరావుపేట, మార్చి 7: పట్టణంలో కోటప్పకొండ తిరునాళ్ళ సందడి నెలకొంది. తిరునాళ్ళకు పట్టణాన్ని పురపాలక సంఘం ముస్తాబు చేసింది. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ప్రధాన రహదారులను, శివుని విగ్రహం, మల్లమ్మ సెంటర్, కోటప్పకొండ రోడ్డు ప్రాంతాలను విద్యుత్ దీపాలతో అలంకరించారు. పట్టణ నడి బొడ్డున వున్న మహాశివుని విగ్రహాన్ని ముస్తాబు చేశారు. కొండకు తరలివెళ్ళే ప్రభలను సిద్ధం చేశారు. ఈ సందర్భంగా జరిగిన ఊరేగింపులతో తిరునాళ్ళ కోలాహలం నెలకొంది. శుక్రవారం ఉద యం పట్టణంలోని ప్రభలన్నీ కొండ కు పయనం కానున్నాయి. లింగంగుంట్ల, రామిరెడ్డిపేట, బరంపేట, పాతూరు, వినుకొండ రోడ్డు, అరండల్‌పేట తదితర ప్రాంతాలలో కోటప్పకొండకు ప్రభలు నిర్మించారు. తిరునాళ్ళకు తరలి వెళ్ళివచ్చే యాత్రికుల కోసం మునిసిపాలిటీ తాగునీటి వసతిని కల్పించింది. ఆర్టీసీ బస్టాండ్, రైల్వే స్టేషన్, పల్నాడు రోడ్డు, ము నిసిపల్ కార్యాలయం ప్రాంతాలలో చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. పట్టణంలో ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసుశాఖ ప్రత్యేక చర్యలు చేపట్టింది. మునిసిపాలిటీ ఆధ్వర్యంలో బస్టాండ్, రైల్వే స్టేషన్, వివిధ రహదారుల్లో తాత్కాలిక మరుగుదొడ్లను ఏర్పాటు చేశారు. పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి సారించారు. మునిసిపల్ కమిషనర్ సీ రవిచంద్రరెడ్డి, అధికారులు పట్టణంలో ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు.



శంఖారావం సభలో మాట్లాడుతున్న జీవీ ఆంజనేయులు

అరాచక పాలనను అంతమొందించటమే లక్ష్యం

● మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండ టౌన్, మార్చి7: రాష్ట్రంలో అరాచక పాలనను అంతమొందించడమే లక్ష్యంగా టీడీపీ శ్రేణులు పనిచేసి ప్రజల్లో చైతన్యం నింపాలని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. టీడీపీ కార్యాలయంలో గురువారం జరిగిన శంఖారావం సభకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ ఐదేళ్ల జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ప్రజలకు జరిగిన నష్టాన్ని, వైసీపీ అవినీతి అక్రమాలు, అభివృద్ధి అంటే ప్రజలకు తెలియకుండా చేసిన అరాచక పాలనను ఎండగట్టి టీడీపీ, జనసేన నాయకులు ఇంటికి తీసుకువెళ్లి వైసీపీని సాగనంపడమే ధ్యేయంగా పనిచేయాలని అన్నారు. వినుకొండలో అహంకార పూరితపాలన సాగుతోందని, ప్రజలను మోసంచేసిన ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు దోపిడీని ప్రజల్లోకి తీసుకుపోవాలని కోరారు. అనంతరం మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు మాట్లాడుతూ బొల్లా బ్రహ్మనాయుడు దుర్మార్గాలను నిలువరించటమే లక్ష్యంగా పనిచేస్తున్నామన్నారు. ఎమ్మెల్యే దుర్మార్గాలపై శివయ్య స్థూపం సెంటర్లో తేల్చుకోవడానికి సిద్ధమన్నారు. వినుకొండలో లా అండ్ ఆర్డర్ అదుపు తప్పిందని, సీనియర్ నాయకులు మీసాల అంజయ్య తలపగలగొట్టడం ఎమ్మెల్యే దుర్మార్గానికి నిదర్శనం అన్నారు. మైనార్టీ నాయకుడు షమీంఖాన్‌పై దాడిచేసి గాయపరచడం, ఎమ్మెల్యే దౌర్జన్యాలు చేస్తుంటే అరికట్టాల్సిన అధికారులు ప్రేక్షక పాత్ర వహిస్తున్నారంటే లా అండ్ ఆర్డర్ ఏ స్థాయిలో అదుపుతప్పిందో అర్థమవుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిరాధారమైన ఆరోపణలు తగదు: బొల్లా

వినుకొండ టౌన్, మార్చి 7: మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావులు తనపై నిరాధారమైన ఆరోపణలు చేస్తున్నారని, ఇది ఎంతమాత్రం తగదని ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు హెచ్చరించారు. స్థానిక వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తనపై చేసిన ఆరోపణల్లో వాస్తవం లేదన్నారు. వినుకొండలో తాను చేసిన అభివృద్ధిని ప్రజలకు చెబుతున్నానని అన్నారు. ఎవరు అనారోగ్యంతో మృతి చెందినా నా ఖాతాలో వేయడం మంచి పద్ధతి కాదన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ చిన్నబ్బాయి. పగడాల వెంకటరామిరెడ్డి తదితరలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి

పన్ను వసూళ్లను వేగవంతం చేయండి: కమిషనర్

నరసరావుపేట రూరల్, మార్చి 7: నరసరావుపేట మునిసిపాలిటీ పరిధిలో పన్ను వసూళ్లను వేగవంతం చేయాలని మునిసిపల్ కమిషనర్ రవిచంద్రరెడ్డి తెలిపారు. పురపాలక సంఘంలో రెవెన్యూ విభాగం ఆధ్వర్యంలో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో మున్సిపల్ కమిషనర్ సి.రవిచంద్ర రెడ్డి గురువారం సమీక్ష మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా మునిసిపల్ కమిసనర్ మాట్లాడుతూ ప్రతిఒక్కరూ ప్రభుత్వం కల్పించిన వడ్డీ లేకుండా పన్ను చెల్లింపు అవకాశాన్ని ఇంటి యజమానులకు వివరించి, పన్నులు చెల్లించేలా చూసుకోవాలని తెలిపారు. ప్రతిటీం సభ్యులందరూ రోజువారీగా టార్గెట్ పెట్టుకొని వాటిని రీచ్ అవ్వాలని తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ ఇంజనీర్ కనకారావు మరియు మున్సిపల్ రెవెన్యూ ఆఫీసర్ అబ్దుల్ జబ్బర్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు నిర్మాణం కోసం సీఎంకు పోస్టుకార్డు ఉద్యమం

వినుకొండ టౌన్, మార్చి 7: పవన్‌కల్యాణ్ ఆదేశాల మేరకు గుడ్‌మార్నింగ్ సీఎం అనే కార్యక్రమంలో భాగంగా వినుకొండ- అద్దంకి ప్రధాన రహదారి గుంతల మయంగా మారిందని, నూతన రోడ్డు నిర్మాణం కోసం పోస్టుకార్డు ఉద్యమాన్ని జనసేన పార్టీ లీగల్‌సెల్ నాయకుడు నక్కా రమణారావు ఆధ్వర్యంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా రమణారావు మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని పలుమార్లు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోవడంతో 300 ఉత్తరాలను ముఖ్యమంత్రి, 200 ఉత్తరాలు ప్రధానమంత్రికి రాశామన్నారు. కార్యక్రమంలో దావులూరి వీరాంజి, యాదాల వెంకటేష్, అలిశెట్టి రంగనాయకులు, అనిల్‌కుమార్, బండారు వెంకటకృష్ణ, జపాన్‌తో పాటు టీడీపీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వికలాంగుల మహాగర్జనను జయప్రదం చేయాలి: కన్ని

వినుకొండ, మార్చి 7: ఈ నెల 9వ తేదీన అమరావతిలో మందా కృష్ణమాదిగ ఆధ్వర్యంలో జరిగే వికలాంగుల మహాగర్జన సభను జయప్రదం చేయాలని ఎమ్మార్పీఎస్ నియోజకవర్గ అధ్యక్షుడు పందుల కన్ని గురువారం కోరారు. ఈ సందర్భంగా కన్ని మాట్లాడుతూ వికలాంగుల పింఛను రూ.6వేలుకు పెంచేలా డిమాండ్ చేస్తూ జరిగే వికలాంగుల మహాగర్జనకు వేలాదిగా పాల్గొనాలన్నారు.

వ్యాపార వేత్త సుబ్బారావు మృతి

వినుకొండటౌన్, మార్చి 7: ఆర్యవైశ్య ప్రముఖుడు, వ్యాపారవేత్త పెనుగొండ సుబ్బారావు (81) అనారోగ్య కారణాలతో గురువారం మృతిచెందాడు. సుబ్బారావు వినుకొండ పరిసర ప్రాంతాల్లో పెట్రోల్ బంక్‌లతో పాటు సినిమా థియేటర్లను నిర్మించడమే కాకుండా గతంలో టీడీపీలో క్రియాశీలంగా వ్యవహరించి మంచి పేరు సంపాదించారు. సమాచారం తెలుసుకున్న పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యేలు వీరపనేని యలమందరావు, మక్కెన మల్లికార్జునరావుతో పాటు పలువురు రాజకీయ నాయకులు ఆర్యవైశ్య ప్రముఖులు అయనకు నివాళులర్పించి కుటుంబసభ్యులకు సంతాపాన్ని తెలిపారు.

పోలింగ్ ప్రశాంతంగా జరిగేలా ప్రజలు సహకరించాలి: రూరల్ సీఐ

శావల్యాపురం, మార్చి 7: రానున్న ఎన్నికలలో ప్రజలంతా వివాదాలకు దూరంగా ఉండి ప్రశాంతంగా పోలింగ్ జరిగేందుకు సహకరించాలని రూరల్ సీఐ ఉప్పుటూరి సుధాకర్‌రావు అన్నారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు పోలీసు బలగాలపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించేందుకు మండలంలోని వేల్పూరు, పొట్లూరు గ్రామాలలో గురువారం పోలీసు, కేంద్ర బలగాలతో కవాతు నిర్వహించారు. గ్రామాలలో ప్రజలతో ముఖాముఖి నిర్వహించి గ్రామంలోని పరిస్థితులు, గతంలో ఎన్నికలు జరిగిన తీరును తెలుసుకొన్నారు. రూరల్ సీఐ మాట్లాడుతూ ఎన్నికలలో ప్రజలంతా ప్రశాంతంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని, ఏమైనా సమస్యలుంటే ముందుగానే పోలీసుల దృష్టికి తేవాలని కోరారు. కార్యక్రమంలో ఎస్ఐ చల్లా సురేష్, కానిస్టేబుళ్ళు పాల్గొన్నారు.

కాంతులీనుతున్న కోటప్పకొండ

● 3,000 మంది పోలీసులతో బందోబస్తు

● భక్తుల సేవలకు కోటప్పకొండలో సర్వం సిద్ధం





కాంతులీనుతున్న కోటప్పకొండ, ప్రత్యేక అలంకరణలో నంది

కోటప్పకొండ (నరసరావుపేట), మార్చి 7: కోటయ్య తిరునాళ్లకు త్రికోటేశ్వరస్వామి సన్నిధి ముస్తాబైంది. ప్రసిద్ధ శైవ క్షేత్రం కోటప్పకొండ తిరునాళ్ళ శుక్రవారం నేత్రపర్వంగా జరగనుంది. భక్తుల కోసం కోటప్పకొండలో సర్వం సిద్ధం చేశారు. రంగురంగు విద్యుత్ దీపాలతో కోటప్పకొండ కాంతులీనుతోంది. కొండ దిగువున, దేవాలయం వద్ద ప్రసాదం విక్రయాలు జరగనున్నాయి. అభిషేకం రూ.500, ఉచిత దర్శనం, శీఘ్ర దర్శనం రూ.200, ప్రత్యేక దర్శనం రూ.100 వేర్వేరుగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. లక్షలాది మంది యాత్రికులు రాష్ట్ర నలుమూలల నుంచే కాక ఇతర రాష్ట్రాల నుంచి రానున్న నేపథ్యంలో పటిష్టమైన పోలీసు బందోబస్తును ఏర్పాటు చేశారు. కొండ వద్ద చిలకలూరిపేట రోడ్డులో, ఘాట్ రోడ్డు పక్కన, కొండపైన ఆర్టీసీ తాత్కాలిక బస్టాండ్లను ఏర్పాటు చేసింది. కొండ దిగువున ప్రభుత్వ స్టాల్స్ ఏర్పాటు చేశారు. ఎక్సైజ్ శాఖ కొండ ప్రాంతంలో మద్య నిషేధాన్ని విధించింది. పది కిలోమీటర్ల వరకు మద్యం విక్రయాలను నిలిపివేశారు. దేవస్థానం ప్రాంతంలో, క్యూలైన్లలో తాగునీటిని పంపిణీ చేసేందుకు ఏర్పాట్లు చేశారు. కాళింది మడుగులో బోట్ షికార్, పిల్లల రాజ్యంలో చిన్నారుల కోసం ఆట వస్తువులను, ట్రాయ్ ట్రైన్‌ను ఏర్పాటు చేశారు. చిన్నపిల్లల ఆట వస్తువుల స్టాల్స్, జెయింట్ వీల్స్, రంగుల రాట్నాలు, చెరుకుల స్టాల్స్ కొలువు దీరాయి. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో దేవస్థానం వద్ద, కొండ దిగువ ప్రాంతాల్లో తొమ్మిది వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. కొండలోని పీహెచ్‌సీలో ప్రత్యేకంగా పడకలు ఏర్పాటు చేశారు. మొబైల్ కోర్టు నిర్వహించనున్నారు. తిరునాళ్లలో పటిష్ట భద్రతా చర్యలను పోలీసు శాఖ చేపట్టింది. ఎస్పీ రవిశంకర్ రెడ్డి ఆధ్వర్యంలో నరసరావుపేట డీఎస్పీ వీఎస్ఎన్ వర్మ పర్యవేక్షణలో 2,500 మంది పోలీసులు బందోబస్తుకు హాజరుకానున్నారు. కొండ ఎగువ, దిగువన కమాండ్ కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేశారు. కొండ ప్రాంతం వద్ద డాగ్ స్క్వాడ్‌తో తనిఖీలు చేశారు. చిలకలూరిపేట, నరసరావుపేట, పెట్లూరివారిపాలెం రహదారుల్లో ట్రాఫిక్ జామ్ అవ్వకుండా చర్యలు చేపట్టారు. సీసీ కెమెరాలు, వాచ్ టవర్స్ ఏర్పాటు చేశారు. కొండ ఎగువన, దిగువన తాత్కాలిక రూరల్ పోలీసుస్టేషన్ నెలకొల్పారు. తిరునాళ్ల ఏర్పాట్లపై కలెక్టర్ శివశంకర్ అధికారులతో సమీక్షిస్తున్నారు.

ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే గోపిరెడ్డి

తిరునాళ్ల ఏర్పాట్లను ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి గురువారం పరిశీలించారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అధికారులు సమన్వయంతో పనిచేసి సేవలు అందజేయాలని సూచించారు. తాగునీరు, పారిశుధ్యం, ట్రాఫిక్‌పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు.

కొండకు తరలివెళ్ళిన ప్రభలు

చిలకలూరిపేట, మార్చి 7: చిలకలూరిపేట ప్రాంతం నుంచి మహాశివరాత్రి తిరునాళ్ళకు భారీ వ్యయంతో నిర్మించిన విద్యుత్ ప్రభలు గురువారం తరలివెళ్ళాయి. శుక్రవారం ఉదయం కోటప్పకొండకు ఇవి చేరుకుంటాయి. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రభల వద్ద భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. ఉత్సాహంగా ప్రభలను కొండకు తరలించారు.

● నాదెండ్ల: మండలంలోని అమీన్‌సాహెబ్‌పాలెం, అప్పాపురం గ్రామాలకు చెందిన భారీ విద్యుత్ ప్రభలు కోటప్పకొండకు గురువారం మధ్యాహ్నం నుంచి తరలివెళ్ళాయి. ఆయా గ్రామాల్లో బుధవారం రాత్రి వైభవంగా విద్యుత్ వెలుగుల మధ్య సాంస్కృతిక కార్యక్రమాలు జరిగాయి.



కొండకు తరలి వెళ్తున్న ప్రభలు

మహిళా శక్తికి శతకోటి వందనం

టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు



అంతర్జాతీయ మహిళా దినోత్సం కార్యక్రమంలో మాట్లాడుతున్న తెలుగుదేశంపార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు

వినుకొండ, మార్చి 7: మహిళా శక్తికి శతకోటి వందనాలని తెలుగుదేశం పార్టీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సం సందర్భంగా విఠంరాజుపల్లి సమీపంలోని జీవీ గెస్టుహౌస్‌లో గురువారం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంజనేయులు మాట్లాడుతూ మహిళలు అడుగుపెట్టిన ప్రతి రంగంలోనూ మహిళలు చరిత్ర సృష్టిస్తున్నారని అన్నారు. మహిళల జీవితాలు మార్చేందుకు టీడీపీ-జనసేన సంయుక్తంగా మహాశక్తి పథకం రూపొందించడం జరిగిందని, అధికారంలోకి రావడంతోనే పథకం అమలు చేయడం జరుగుతుందని మహిళలకు ఆంజనేయులు హామీ ఇచ్చారు. ఆడబిడ్డలు అన్ని రంగాల్లో మగవారితో సమానంగా రాణించాలని నందమూరి తారకరామారావు ఆలోచించారని అన్నారు. టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు మహిళలకు 33శాతం రిజర్వేషన్ కల్పించి ప్రోత్సహించారన్నారు. 50శాతం ఉన్న మహిళలు అందరూ చదువుకోవాలని చంద్రబాబు చర్యలు తీసుకున్నారని, వారి ఉన్నత విద్యకోసం మహిళా విశ్వవిద్యాలయం కూడా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటాయని, మద్యపానం నిషేదం చేశాకే మరలా మీ వద్దకు వచ్చి ఓటు అడుగుతానని జగన్‌రెడ్డి నమ్మించి మోసం చేశాడన్నారు. మహిళలపై రోజు, రోజుకు అత్యాచారాలు నేరాలు,ఘోరాలు పెరిగిపోతున్నాయని దేశంలోనే మనరాష్ట్రం మొదటి స్థానంలో ఉందన్నారు. రాష్ట్రంలో ప్రతి మూడు గంటలకు మహిళపై దాడులు, ప్రతి ఎనిమిది గంటలకు అత్యాచారం జరుగుతున్నాయని తెలిపారు. టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే నేరాల కట్టడికి ప్రత్యేక యాక్టు తీసుకురావడం జరుగుతుందని హామీఇచ్చారు. అనంతరం మహిళలకు శుభాకాంక్షలు తెలిపి, ప్రతి ఒక్కరిని సన్మానించారు.


కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లిఖార్జునరావు సతీమణి పద్మావతి, జనసేన పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి కన్నా రజిని, సినిమా డైరెక్టర్ మేదరమెట్ల సౌజన్య, తెలుగుదేశం పార్టీ అధికార ప్రతినిధి గద్దె రాజ్యలక్ష్మి, జిల్లా మహిళా అధ్యక్షరాలు దాసరి ఉదయశ్రీ, శావల్యాపురం జడ్పీటీసీ పారా హైమావతి, నూజెండ్ల జడ్పీటీసీ సుబ్బులు, నియోజకవర్గం మహిళా నాయకులు ముప్పాడి చౌడమ్మ, కౌన్సిలర్ పోలూరి అంజలిదేవి, ఆదిలక్ష్మి, బట్లగుంట లక్ష్మి, చెవులు సుబ్బులు, బసమ్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రజారోగ్యంతో చెలగాటమాడుతున్న ఎమ్మెల్యే బొల్లా

● ప్రభుత్వం నుంచి ఒక్క రూపాయి కూడా తీసుకురాని దద్దమ్మ

● గత ప్రభుత్వ హయాంలో మంజూరైన నిధులతో గప్పాలు

● అభివృద్ధిపై చర్చకు సిద్ధమా: జీవీ, మక్కెన



వినుకొండలో సరఫరా అవుతున్న నీటిని చూపుతున్న మాజీ ఎమ్మెల్యేలు జీవీ, మక్కెన

వినుకొండ, మార్చి 7: మంజూరైన తాగునీటి పథకాన్ని పూర్తిచేయకుండా, ప్రజలకు కలుషిత నీటిని అందిస్తూ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు ప్రజారోగ్యంతో ఆటలాడుకుంటున్నారని తెలుగుదేశం పార్టీ జిల్లా అధ్యక్షుడు పల్నాడు జీవీ ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు విమర్శించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో జీవీ మాట్లాడుతూ వినుకొండలో తాగునీటి ఎద్దడిని శాశ్వతంగా పరిష్కరించాలనే లక్ష్యంతో నాడు కేంద్రమంత్రి వెంకయ్య నాయుడు దృష్టికి తీసుకెళ్లి రూ.161 కోట్లు తీసుకురావడం జరిగిందన్నారు. ఎంతో కష్టపడి తాము తాగునీటి పథకాన్ని తీసుకొస్తే ఎమ్మెల్యే బొల్లా కమిషన్ల కోసం చేసిన డిమాండ్‌కు కాంట్రాక్టర్లు పనులు ఆపి వెళ్లడంతో పైపులు, పరికరాలన్నీ నిరుపయోగంగా మారాయన్నారు. ఎమ్మెల్యే బొల్లా నంబరు వన్ చీటర్ అని, టీడీపీ హయాంలో మంజూరైన నిధులతో చేసిన పనులన్నీ తానే చేసినట్లుగా తప్పుడు ప్రచారం చేస్తూ ఐదేళ్లల్లో వినుకొండ అభివృద్ధికి ఒక్క రూపాయి కూడా తీసుకురాని అసమర్థ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు అని విమర్శించారు. నాగార్జునసాగర్‌లో తాగునీరు లేని సమయంలో సమర్థవంతంగా వినుకొండ ప్రజలకు ప్రభుత్వం, సొంత నిధులు ఖర్చు చేసి తాగునీటి సమస్య తలెత్తకుండా నీరు అందించామన్నారు. రూ.20లక్షలతో చెరువుకట్టలను వెడల్పు చేసి రూ.60లక్షలు ఖర్చు చేసినట్లు లెక్కచూపి అనధికారికంగా మున్సిపల్ ప్రజాధనాన్ని రూ.40లక్షలు దోచుకున్నది నీవు కాదా అని ప్రశ్నించారు. ఆరు నెలల్లో వరికపూడిశెల ప్రాజెక్టును పూర్తి చేస్తానని ప్రజలను దగాచేసిన ఎమ్మెల్యే బొల్లా అన్నారు. ప్రాజెక్టు నిర్మాణం అనుమతులకు ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు పార్లమెంటులో అనేకసార్లు చర్చించి అటవీశాఖ అనుమతులు తెచ్చారని, వరికపూడిశెల ప్రాజెక్టు నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం కనీసం అనుమతులు కూడా ఇవ్వకుండా మోసం చేశారన్నారు. మూగచింతలపాలెం డీప్ కట్ నుంచి పైపులైన్ వేసి చెరువు నింపి తాగునీటి సరఫరాకై రూ.12కోట్లు నిధులు ఇస్తానని సీఎం హామీ ఇచ్చి ఏడాది అయినా నేటికీ నెరవేర్చలేదన్నారు. తన అక్రమ సంపాదన, స్వార్థ రాజకీయం కోసం ప్రజారోగ్యంతో చెలగాటమాడుతూ దొండపాడు నుంచి కలుషిత నీటిని వినుకొండ పట్టణ ప్రజలకు సరఫరా చేయడం దారుణమన్నారు. 25ఏళ్లుగా అనేక సేవా కార్యక్రమాలతో ప్రజాదరణ పొంది శివశక్తి లీలా అండ్ అంజన్ ఫౌండేషన్‌పై ఎమ్మెల్యే బొల్లా చేస్తున్న విమర్శలను ఖండించారు. తనపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. తిరుమల డెయిరీ ఇండస్ట్రీలో జరిగిన కల్తీ పాల విక్రయాలు, మనుషులు చనిపోయిన కేసుల్లో బొల్లా నిందితుడని, తిరుమల డెయిరీ వ్యవస్థాపకుడు ధూళిపాళ్ల సాంబశివరావు మానసిక క్షోభను అనుభవించి ఎవరి కారణంగా మరణించారో అందరికీ తెలుసన్నారు. అమరా ఇంజనీరింగ్ కళాశాల వ్యవస్థాపకుడు అమర వెంకటేశ్వర్లును వేధించి అతని చావుకు కారణమయ్యారని ఆరోపించారు. ఎస్ఎస్‌పీ స్థలాన్ని మున్సిపాలిటీకి అప్పగిస్తే 400షాపులు కట్టి వ్యాపారంచేసి ఎమ్మెల్యే బొల్లా దోచుకోవడానికి ప్రయత్నించడం దుర్మార్గమన్నారు. అభివృద్ధి అంశంపై ప్రజాక్షేత్రంలో చర్చకు తాము సిద్ధమని, ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు చర్చకు రావాలని, సమయం చెప్పాలని సవాల్ విసిరారు. అనంతరం మక్కెన మాట్లాడుతూ వ్యక్తిగత విమర్శలు తగదన్నారు. మైనర్ ఇరిగేషన్ చెరువుల్లో ఫీడ్ పెట్టకూడదని, చట్టవిరుద్ధంగా అన్ని చెరువుల్లో వల్లభ ఫీడ్ అందించి కోట్లు కొల్లగొడుతున్నది నీవు కాదా అని ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు ఆపి అభివృద్ధిపై ప్రజాక్షేత్రంలో బహిరంగ చర్చకు రావాలని ఎమ్మెల్యేకు సవాల్ విసిరారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు అయూబ్‌ఖాన్, షమీమ్‌ఖాన్, రాపర్ల జగ్గారావు, బీసీ నాయకుడు గోవింద రాజులు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలోకి కొత్తపల్లికి చెందిన పలు కుటుంబాలు

రొంపిచర్ల, మార్చి 7: మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన పలువురు చదలవాడ అరవిందబాబు సమక్షంలో గురువారం టీడీపీలో చేరారు. వీరికి అరవిందబాబు పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. లాల్ సాహెబ్, మొగల్ సాయి, హుస్సేన్ బాషా, సైదా తదితరులు పార్టీలో చేరిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో పులుకూరి జగ్గయ్య పాల్గొన్నారు.

బాలికల సంరక్షణ అందరి బాధ్యత: సీడీపీవో

రొంపిచర్ల, మార్చి 7: బాలికల సంరక్షణ అందరి బాధ్యత అని సీడీపీవో ఉమాదేవి తెలిపారు. మండలంలోని రొంపిచర్ల మండల పరిషత్ కార్యాలయంలో మహిళా పోలీసులు, డ్వాక్రా మహిళలు, ఆషా వర్కర్లకు అవగాహన సదస్సు గురువారం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ అధికారి శౌరీలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాలను నివారించాలన్నారు. మహిళల చట్టాల గురించి వివరించారు. కిషోర బాలికల ఆరోగ్య పరిస్థితుల పై వివరించారు. ఈ కార్యక్రమంలో సూపర్ వైజర్లు పాల్గొన్నారు.

నేడు మన్నెపల్లి లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల



మన్నెపల్లి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం

బొల్లాపల్లి, మార్చి 7: మండలంలోని నలమల అటవీ ప్రాంతంలోని రావులాపురం పంచాయతీ మన్నెపల్లి తండా పరిధిలోని లక్ష్మీనరసింహస్వామి తిరునాళ్ల నేడు జరగనుంది. ప్రతి ఏటా మహాశివరాత్రి పర్వదినాన స్వామి వారికి లక్షలాది మంది భక్తుల సమక్షంలో కళ్యాణం జరుగుతుంది. శుక్రవారం రాష్ట్రం మొత్తం శివ నామస్మరణతో మారుమోగుతుంటే బొల్లాపల్లి లక్ష్మీనరసింహా స్వామి దేవాలయంలో వెంకటేశ్వర స్వామి కళ్యాణం జరగనుంది. కళ్యాణాన్ని తిలకించేందుకు సమీప గ్రామాల నుంచి భారీ ఎత్తున భక్తులు తరలి రానున్నారు.

ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం

చిలకలూరిపేట, మార్చి 7: స్థానిక అసిస్ట్ సంస్థ ఆవరణలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసిస్ట్ సంస్థ, ఐటీసీ సంస్థల ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నాదెండ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో శాంతకుమారి, అసిస్టెంట్ సీడీపీవో నిర్మల కుమారి, యడ్లపాడు ఎంఈవో నాగరత్నం, ఇన్నర్ వీల్ క్లబ్ అధ్యక్షురాలు డాక్టర్ ఇందిర తదితరులు పాల్గొని మహిళా దినోత్సవ ప్రాధాన్యం గురించి వివరించారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ జాష్టి రంగారావు, అసోసియేట్ డైరెక్టర్లు కృష్ణ హరి, మూర్తి, విష్ణు ప్రియ తదితరులు పాల్గొన్నారు.

ఐఎంఏ ఆధ్వర్యంలో...

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన మరొక కార్యక్రమంలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. డాక్టర్ లావు అరుణ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మహిళా డాక్టర్లు మహిళా సాధికారిత గురించి చర్చించారు. ఆటల పోటీలను నిర్వహించారు. సీనియర్ మహిళా డాక్టర్ కందిమళ్ళ జయమ్మను సత్కరించారు. ఐఎంఏ కార్యదర్శి డాక్టర్ మధులత, డాక్టర్ ప్రశాంతి, డాక్టర్ రమ్య, డాక్టర్ రాణి, డాక్టర్ హర్షిత తదితరులు పాల్గొన్నారు.

శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వర్ధంతి

చిలకలూరిపేట, మార్చి 7: పట్టణంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం గ్రంథాలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అయ్యంకి వెంకట రమణయ్య వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. కమిటీ అధ్యక్షుడు డాక్టర్ బీ సుబ్బారావు గ్రంథాలయ అభివృద్ధికి అయ్యంకి చేసిన సేవలను వివరించారు. అయ్యంకి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కమిటీ కార్యదర్శి డి.బుచ్చిబాబు, గ్రంథాలయ ఇన్‌చార్జ్ మీరావలి, సలోమి, పాఠకులు పాల్గొన్నారు.

యువకుడిపై కత్తితో దాడి

వినుకొండటౌన్, మార్చి 7: పాతకక్షల నేపథ్యంలో ఒక యువకుడిపై కత్తితో దాడి చేసిన సంఘటన పట్టణంలోని అంబేద్కర్ కాలనిలో గురువారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల మేరకు ఇంటి సమీపంలో కిందపడిన ద్విచక్రవాహనాన్ని పోలా శ్రీను పరిశీలిస్తుండగా పులి వెంకటేశ్వర్లు వచ్చి కత్తితో దాడిచేసినట్లు తెలిపారు. ఘర్షణకు గల కారణాల తెలియరాలేదు. గాయపడిన శ్రీనును వినుకొండలోని ఆసుపత్రికి తరలించి చికిత్స చేస్తున్నారు.

'మహాశివరాత్రిని ఆనందంగా జరుపుకోండి'

చిలకలూరిపేట అర్బన్, మార్చి 7: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని పల్నాడు జిల్లా ప్రజలతో పాటు తెలుగు ప్రజలందరికీ మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు శుభాకాంక్షలు తెలిపారు. మహాశివరాత్రి పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో ఆనందంగా జరుపుకోవాలని ఆయన ఆకాంక్షించారు. ఉపవాస దీక్షలతో జాగరణతో శివరాత్రిని ఘనంగా జరుపుకోవాలని, పరమేశ్వరుని అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

● నరసరావుపేట టౌన్: మహాశివరాత్రి పురస్కరించుకొని పల్నాడు జిల్లా ప్రజలతోపాటు తెలుగు వారందరికి టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు గురువారం శుభాకాంక్షలు ఒక ప్రకటనలో తెలియజేశారు. పర్వదినాన్ని ప్రజలు భక్తిశ్రద్ధలతో, ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. పరమేశ్వరుడి అనుగ్రహంతో రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు.

కనమర్లపూడిలో విషజ్వరాల నివారణకు చర్యలు

'ఆంధ్రజ్యోతి'కి స్పందన

కనమర్లపూడి (శావల్యాపురం) మార్చి 7: మండలంలోని కనమర్లపూడిలో ప్రజలు విషజ్వరాల బారినపడి తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎట్టకేలకు ఉన్నతాధికారులు స్పందించి గురువారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. గురువారం ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన 'విషజ్వరాలతో కనమర్లపూడి విలవిల' అన్న కథనానికి స్పందించిన అధికారులు గ్రామానికి చేరుకొని ఆరోగ్య, ఆశాకార్యకర్తలతో జ్వరాల సర్వే చేయించి 42మంది జ్వరపీడుతులను గుర్తించి వారికి వైద్యపరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వైద్యాధికారి ప్రశాంత్, వినుకొండ మలేరియా యూనిట్ సూపర్‌వైజర్ బాలస్వామి, హెల్త్ అసిస్టెంట్ వెంకట్రావు, హెల్త్ సూపర్‌వైజర్ ఏడుకొండలు, ఏఎన్ఎంలు రాజ్యలక్ష్మి, విజయలక్ష్మి, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కులను అందజేస్తున్న జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

జీవనోపాధి పెంపొందించుకునేందుకే చేయూత

● జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్

నరసరావుపేట రూరల్, మార్చి 7: గ్రామీణ ప్రాంత ప్రజల జీవనోపాధి పెంపొందించుకునేందుకే వైఎస్ఆర్ చేయూత అందించడం జరుగుతుందని జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ తెలిపారు. గురువారం ఉదయం పల్నాడు జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ నుంచి వైఎస్సార్ చేయూత పథకం నిధులు విడుదల కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్, ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా మహిళా సంఘం అధ్యక్షురాలు అనూష, పీడీలు డీఆర్డీఏ పీడీ బాలునాయక్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ వై.ఎస్.ఆర్ చేయూత జీవనోపాధిని ప్రోత్సహించడం కోసం బహుళజాతి కంపెనీలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకున్నారన్నారు. పాడి పరిశ్రమ అభివృద్ధి, రిటైల్ రంగాలలో మహిళలు జీవనోపాధులను అభివృద్ధి చేసుకోవడం ద్వారా వారి కుటుంబ ఆదాయాలను పెంచుకుంటున్నారన్నారు. వై.యస్.ఆర్ చేయూత నాల్గోవ విడత ద్వారా పల్నాడు జిల్లాలో 96,862 మంది మహిళా లబ్ధిదారులకు రూ.181.61 కోట్ల రూపాయల ఆర్థికసాయాన్ని జాయింట్ కలెక్టర్ అందించారన్నారు.పల్నాడు జిల్లాలో వైఎస్ఆర్ చేయూత నిదులను సద్వినియోగం చేసుకోవాలి సూచించారు.

'రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు'

మైదవోలు (యడ్లపాడు), మార్చి 7: మాజీమంత్రి ప్రత్తిపాటి పుల్లారావును రాజకీయంగా ఎదిరించే ధైర్యంలేక కుమారుడు శరత్‌పై అక్రమ కేసులు బనాయించి అరెస్టు చేయడం పిరికిచర్య అంటూ టీడీపీ నాయకులు మండిపడ్డారు. శరత్ అరెస్టును వ్యతిరేకిస్తూ బుధవారం రాత్రి మండలంలోని మైదవోలులో తెలుగుదేశంపార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ఎన్టీఆర్ విగ్రహం వద్ద ప్లకార్డులు చేతపట్టి శరత్‌ను వెంటనే విడుదల చేయాలంటూ నినాదాలు చేశారు. గ్రామ టీడీపీ అధ్యక్షుడు నక్కా పోతురాజు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో నాయకులు తోకల రాజేష్, నక్కా వెంకటేశ్వర్లు, నక్కా కోటేశ్వరరావు, సురేశ్వరరావు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థులకు దాతల సహకారం అభినందనీయం

పోట్లూరు (శావల్యాపురం) మార్చి 7: ప్రభుత్వ పాఠశాలలలో చదువుతున్న పేద విద్యార్థులకు దాతలు స్వచ్ఛందంగా తమవంతు సహకారమందించి వారిని ప్రోత్సహించడం అభినందనీయమని పాఠశాల హెచ్‌ఎం సింగంశెట్టి అన్నపూర్ణమ్మ అన్నారు. గంగినేని ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండలంలోని పోట్లూరు జడ్పీ పాఠశాలలో పది పరీక్షలు రాయబోతున్న 52మంది విద్యార్థులకు పరీక్షా సామగ్రిని గురువారం పంపిణీ చేశారు. విద్యార్థులకు పౌష్టికాహార ఖర్చుల నిమిత్తం రూ.5వేల నగదును హెచ్‌ఎంకి అందజేశారు. ఫౌండేషన్ అధినేత గంగినేని రాఘవ మాట్లాడుతూ పరీక్షా సమయంలో విద్యార్థులు ఒత్తిడికి లోనుకాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని, ప్రతిరోజూ క్రమం తప్పకుండా పౌష్టికాహారాన్ని తీసుకోవాలని, ఉపాధ్యాయుల సూచనలతో ఉత్తమఫలితాలు సాధించాలన్నారు. పరీక్షల్లో 500 పైగా మార్కులు సాధించిన విద్యార్థులందరికీ నగదు బహుమతులు అందజేస్తానని ప్రకటించారు. సినీనిర్మాత లగడపాటి శ్రీనివాసరావు, మరిడి సురేష్, తెలుగు విద్యార్థి సంఘం రాష్ట్ర నాయకులు రామబ్రహ్మం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులకు క్రీడా సామగ్రి పంపిణీ

బొల్లాపల్లి, మార్చి 7: మండలంలోని వెల్లటూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని విద్యార్థులకు వెల్లటూరు కెనరా బ్యాంక్ వారు విద్యార్థులకు క్రీడా సామగ్రి కోసం రూ.40వేలు విలువైన క్రీడా సామగ్రిని విద్యార్థులకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు షేక్ అలీషా మాట్లాడుతూ బ్యాంక్ సిబ్బందికి విద్యార్థుల తరుపున కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బ్యాంక్ మేనేజర్ జోసెఫ్ కుమార్, నారాయణరావు మాట్లాడుతూ విద్యార్థులకు అందించిన క్రీడా సామగ్రిని జాగ్రత్తగా వినియోగించుకోవాలన్నారు. బ్యాంక్ అందిస్తున్న సేవలను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయినీ, ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.